

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం జిల్లా వార్తలు
బుధవారం 19, జూన్ 2024



పేరుకే ల్యాబ్‌లు

దిష్టి బొమ్మల్లా భవనాలు

అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటు ఆశయం ఘనంగా ఉన్నా ఆచరణలో విఫలమైంది. భవన నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా చాలాచోట్ల ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు అందుబాటులోకి రాకపోవడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలైంది. దుకాణాల నుంచి ఆయా మండలాల వ్యవసాయాధికారులు ఇప్పటికే విత్తనాలు, ఎరువుల నమూనాలను సేకరించారు. వాటి నాణ్యతను పరీక్షించాల్సి ఉంది. కానీ ల్యాబ్‌లు అందుబాటులోకి రాకపోవడంతో నకిలీలను గుర్తించి రైతులకు మేలు చేకూర్చడం అసాధ్యంగానే కనిపిస్తోంది.





- ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం
- ప్రారంభించి ఏడాదైనా అరకొర పరీక్షలే
- మార్కాపురంలో పూర్తికాని భవన నిర్మాణం
- ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులోకి కష్టమే

మార్కాపురం, జూన్ 18 : గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఐఎండీ చెబుతోంది. ముందు వేసవిలో కూడా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వాతావరణ పరిస్థితులు ఆశాజనంగా ఉండటంతో రైతులు కూడా పంటల సాగుకు సన్నద్ధమవుతోంది. గతేడాది జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలు, ఎరువుల వలన ఆశించిన దిగుబడులు రాక రైతన్నలు ఆర్థికంగా చితికిపోయారు. వారిని నకిలీల బారినుంచి కాపాడేందుకు గత ప్రభుత్వం అగ్రిల్యాబ్ పేరుతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున గత ఏడాది జూలై 8న మంజూరు చేసింది. ఒక్కో ల్యాబ్‌కు రూ.3 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించింది. అందులో రూ.50 లక్షలు భవన నిర్మాణానికి, రూ.2.5 కోట్లు యంత్ర సామగ్రికి కేటాయించారు. అయితే వాటిని పూర్తి చేసే విషయంలో చిత్తశుద్ధి లేక పోవడంతో అవి అందుబాటులోకి రాలేదు. కొన్ని భవనాలు పూర్తయినా పరీక్షలు ప్రారంభం కాలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.

మార్కాపురంలో పూర్తికాని నిర్మాణం

మార్కాపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో అగ్రిల్యాబ్ నిర్మించేందుకు స్థలం కేటాయించారు. 2022లోనే పనులు ప్రారంభమయ్యాయి. సంవత్సరం దాటినా కాంట్రాక్టర్ బేస్‌మెంట్ స్థాయిలోనే పనులు పూర్తి చేశాడు. దీంతో అధికారులు మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. కానీ నేటికీ భవన నిర్మాణం పూర్తికాలేదు. ప్రస్తుతం నిర్మాణాల పరిస్థితి చూస్తే మరో ఆరు నెలలైనా పట్టే అవకాశం ఉంది. ఈలోపు ఖరీఫ్ సీజన్ కూడా ముగుస్తుంది. ఇప్పటికే ల్యాబ్‌కు కేటాయించిన సిబ్బంది విధుల్లేక ఖాళీగా ఉన్నారు.

నష్టపోనున్న పశ్చిమ రైతులు

జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మార్కాపురం డివిజన్. ఇక్కడ వర్షాధారంతో, అవరోధాల నడుమ రైతులు వ్యవసాయం చేస్తున్నారు. తూర్పు ప్రకాశంతో పోలిస్తే విత్తనాలు, ఎరువుల ఎంపిక విషయంలో అవగాహన చాలా తక్కువ. ఈ అవకాశాన్నే వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా పత్తి, మిరప సాగు చేసిన రైతులు నకిలీ విత్తనాల బెడదతో తీవ్రంగా నష్టపోయారు. లైసెన్స్‌లు లేని నర్సరీలు కూడా అందుకు కారణమయ్యాయి. వ్యవసాయశాఖ వారి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు సక్రమంగా చేయిస్తే ఇబ్బందులు తప్పేవే. ఆ దిశగా యంత్రాంగం చొరవచూపడం లేదు. అగ్రిల్యాబ్‌లు అందుబాటులో ఉంటే బహిరంగ మార్కెట్‌లో రైతులు విత్తనాలు కొనుగోలు చేసినా కనీస రుసుం చెల్లించి పరీక్షలు చేయించుకోవచ్చు. కానీ అవి అలంకారప్రాయంగా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

పలుచోట్ల అందుబాటులోకి రానివైనం

మార్కాపురంలో నిర్మాణం పూర్తికాక ప్రారంభం కాలేదు. జిల్లాలోని దర్శి, సంతనూతలపాడుల్లోని అగ్రిల్యాబ్‌లు ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. జిల్లాలోని అన్ని ల్యాబ్‌లలో గతేడాది కేవలం విత్తనాలకు సంబంధించిన పరీక్షలు మాత్రమే చేశారు. ఒక్కో ల్యాబ్‌కు సుమారు 30 రకాల పరికరాలు రావాల్సి ఉండగా 14 మాత్రమే వచ్చాయి. గత సంవత్సరం నుంచి ఒక్కొక్కటిగా వస్తుండటంతో పూర్తిస్థాయిలో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు అవరోధం ఏర్పడుతోంది.

అంతా రివర్స్!

- రెవెన్యూలో చక్రంతిప్పిన వైసీపీ నాయకుడు
- ఓ పనికోసం వీఆర్వోతో రూ.40 వేలకు ఒప్పందం
- నిబంధనలకు విరుద్ధం కావడంతో తాత్సారం
- ప్రభుత్వం మారడంతో టీడీపీ నేతపైకి నెపం
- ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్

పెద్దారవీడు, జూన్ 18: ఎన్నికల ముందు రెవెన్యూ మధ్యవర్తి అవతార మెత్తిన వైసీపీ నాయకుడు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో వ్యవహారశైలిని మార్చాడు. ఇప్పటి వరకూ అధికారం అండతో తహసీల్దార్ కార్యాలయంలో అవసరమైన పనులను చక్కబెట్టేవాడు. రెవెన్యూ సిబ్బందికి చేతులు తడిపి తాను జేబులు నింపుకొంటుండేవాడు. అటువంటి పనులలో భాగంగా ఎన్నికలకు కొద్దిరోజుల ముందు వీఆర్వోతో ఒక పనికి సంబంధించి రూ.40వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో రూ.10వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చాడు. ఎన్నికల పనులలో పడి వీఆర్వో నేత చెప్పిన పనిని నిర్లక్ష్యం చేశాడు. ఎన్నికల అనంతరం ఆ పని గురించి సదరు వైసీపీ నాయకుడు వీఆర్వోను ప్రశ్నించాడు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడటం, రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడంతో వీఆర్వో వెనక్కు తగ్గాడు. ఈ నేపథ్యంలో అసంబద్ధంగా చేసే పనులకు మూల్యం చెల్లించుకోక తప్పదని గ్రహించిన సదరు వీఆర్వో నెపాన్ని టీడీపీ నాయకులపై నెట్టాడు. నియోజకవర్గ టీడీపీ నేత వైసీపీ వారికి ఎటువంటి పనులు చేయకూడదని ఆదేశించారని కొత్త నాటకానికి తెరతీశాడు. వైసీపీ నాయకుడు ఫోన్ చేయగా వాదనకు దిగిన సదరు వీఆర్వో తాను తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తానని, టీడీపీ నాయ కుని ఆదేశాల మేరకే తాను మీకు పని చేయలేకపోయానని తెలిపాడు. ఈ వ్యవహారం పెద్దారవీడు మండలం మద్దలకట్ట రెవెన్యూ గ్రామ పరిధి చోటుచేసుకుంది. వారిద్దరి మధ్య గతంలో అనేక లావాదేవీలు జరిగాయి. ప్రభుత్వం మారడంతో ఈ వ్యవహారం బయటపడింది. వీరి సంభాషణను జడ్డా మార్క్ సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో విషయం వైరలైంది. అయితే వీఆర్వో వద్ద నుంచి డబ్బులు తిరిగి వసూలు చేసుకోవడానికా? టీడీపీ నేతలకు అపకీర్తిని అంటగట్టడానికి ప్రచారం చేశారా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

అసలేం జరిగింది

పెద్దారవీడు మండలం మద్దలకట్టలో సర్వే నెంబర్ 797లో 3.50 ఎకరాలు, 795లో ఎకరా భూమి ఉంది. వాటికి సంబంధించి మూలా నారాయణమ్మ, కొదమల చిన్న యోగులు, ఇజ్రాయిల్, మరియ దాసు, సిరిగిరి పెద్దవెంకటేశ్వర్లు మధ్య వివాదం నడుస్తోంది. వీరిలో కొందరు జడ్డా మార్క్ బంధువులు ఉన్నారు. వారి తరఫున మార్కు రంగంలోకి దిగాడు. తన బంధువుల తరఫున భూమి రికార్డులు తయారుచేసి ఇస్తే రూ.40వేలు ఇస్తానని వీఆర్వో యోగేశ్వరరెడ్డితో రెండు నెలల క్రితం ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా రూ.10వేలు చెల్లించాడు. తదనంతర పరిణామల నేపథ్యంలో వీఆర్వో ఆ పనిపూర్తి చేయలేదు. దీంతో వారిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణను మార్క్ రికార్డు చేశాడు. అందులో పనిపూర్తి చేయడానికి 2నెలల క్రితం డబ్బులు తీసుకున్నట్లు వీఆర్వో యోగీశ్వరరెడ్డి అంగీకరించాడు. వాటిని తిరిగి ఇచ్చేందుకు కూడా ఒప్పు కున్నాడు. ఇది సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో విషయం జిల్లా స్థాయి అధికారులకు చేరింది. వీఆర్వో సైతం ఒప్పందం జరిగిన విషయాన్ని సహచర సిబ్బంది వద్ద అంగీకరిస్తున్నాడు. మరి ఉన్నతాధికారులు స్పందించి ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

జిల్లాకు కరువు బృందం

- నేటి రాత్రికి రాక
- రేపు అధికారులతో సమీక్ష, క్షేత్రస్థాయి పర్యటన
- గతేడాది రబీలో కరువు నష్టాల పరిశీలన
- నివేదికలు సిద్ధంచేసిన వివిధ శాఖల అధికారులు

ఒంగోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నలుగురు సభ్యులతో కూడిన కేంద్రప్రభుత్వ బృందం జిల్లాకు రానుంది. గతేడాది రబీ సీజన్‌లో కరువు తీవ్రతతో జరిగిన నష్టాలు, జనం ఇక్కట్లు పరిశీలన చేయనుంది. అందుకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా యంత్రాంగం సిద్ధంచేసింది. గతేడాది రబీ సీజన్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాలు కరువు బారిన పడ్డాయి. పంటలు దెబ్బతినడంతోపాటు నీటి కోసం ప్రజానీకం ఇక్కట్లు పడ్డారు. అయితే కరువు తీవ్రతను గుర్తించడం, సహాయక చర్యల విషయంలో నాటి వైసీపీ ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న వేళ మార్చి 7న కరువు ప్రాంతాల ప్రకటించింది. ఎన్నికల అనంతరం మేలో పంట నష్టాలపై అధికారులు జాబితాలను రూపొందించి కేంద్రానికి నివేదించారు. స్థానికంగా నెలకొన్న నీటి ఇక్కట్లపై కొంత చర్యలను అధికారులు చేపట్టారు. కాగా ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కేంద్రప్రభుత్వం కరువుపై స్పందించింది. రాష్ట్రంలో రబీ సీజన్ కరువు పరిశీలన పేరుతో కేంద్రప్రభుత్వ అధికారులు ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు పర్యటించనున్నారు. మొత్తం మూడు బృందాలు అలా పర్యటించనుండగా అందులో ఒకటి బుధ, గురువారాల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రానుంది. కేంద్రప్రభుత్వ పశుసంవర్థక శాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ నేతృత్వంలో జలసంరక్షణ శాఖ డైరెక్టర్ మున్నుజీ ఉపాధ్యాయ, ఆహార ప్రజా పంపిణీ శాఖ డిప్యూటీ సెక్రటరీ మదన్ మోహన్ మౌర్య, నీతి ఆయోగ్ సీనియర్ పరిశోధకురాలు అనురాధభటేలతో కూడిన బృందం మన జిల్లాకు వస్తోంది. బుధవారం నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకొని సాయంత్రానికి ఒంగోలు చేరుకునే కేంద్ర బృందం సభ్యులు రాత్రికి ఇక్కడి ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో బస చేస్తారు.

మూడు మండలాల్లో పర్యటన

కేంద్ర బృందం సభ్యులు గురువారం ఉదయం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తర్లుపాడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో పర్యటించి ప్రజలను కలుసుకొని కరువు తీవ్రతతో వారు పడిన ఇక్కట్లను తెలుసుకుంటారు. అక్కడి నుంచి రాత్రికి విజయవాడ చేరుకుంటారు. కేంద్ర బృందం పర్యటన ఖరారవడంతో అధికార యంత్రాంగం తదనుగుణ చర్యలు చేపట్టింది. రబీ సీజన్‌తో పంట నష్టాలపై ఇప్పటికే వ్యవసాయ శాఖ సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించింది. ఆ ప్రకారం జిల్లాలోని 22 మండలాల్లో 36,147 మంది రైతులు 29,713 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు తేల్చారు. వ్యవసాయశాఖ అధికారులు ఆ నివేదికలను సిద్ధం చేయగా ఇరిగేషన్ చెరువుల్లో చుక్కనీరు లేక ప్రజలు, పశువులకు ఎదురైన అవస్థలు, గ్రామాల్లో తాగునీటి సమస్య ఇతరత్రా అంశాలపై ఆయా శాఖల అధికారులు నివేదికలను తయారు చేశారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సీపీవో వెంకటేశ్వర్లు, డీఏవో శ్రీనివాసరావు, విపత్తుల నిర్వహణ శాఖ డీపీఎం మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌అలీ, ఇతర అధికారులు భేటీ అయ్యి చర్చించారు. కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ శాఖల వారీ నివేదికలపై చర్చించారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 61శాతం ఉత్తీర్ణత

- ప్రైవేటు కంటే ప్రభుత్వ కళాశాలల్లో అధికం
- బాలబాలికలు సమానంగా పాస్

ఒంగోలు(విద్య), జూన్ 18: ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 61శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రస్థాయిలో 12వ స్థానంలో నిలిచారు. రాష్ట్ర సగటు (59శాతం) కంటే జిల్లా విద్యార్థులు రెండుశాతం అధికంగా పాసయ్యారు. బాలబాలికలు సమానంగా 61శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులు 59.5 శాతం మంది ఉత్తీర్ణుల కాగా ప్రభుత్వరంగ కళాశాలల విద్యార్థులు 13శాతం అదనంగా 72.5శాతం పాసయ్యారు. జిల్లాలో ఇంటర్ జనరల్ విద్యార్థులు 5,487 మంది పరీక్షకు హాజరు కాగా 3,330 మంది పాసై 61శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 862మంది పరీక్షకు హాజరు కాగా 534 మంది ఉత్తీర్ణులై 61శాతం ఉత్తీర్ణత సాధించారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 933 మంది పరీక్షకు హాజరు కాగా 698 మంది ఉత్తీర్ణులై 74.6శాతం ఉత్తీర్ణత సాధించారు. అర్ధవీడు, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 100శాతం పాసయ్యారు.,
- ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలల్లో 154 మంది పరీక్షకు హాజరు కాగా 89 మంది (57.8శాతం) ఉత్తీర్ణులయ్యారు. దోర్నాల కళాశాలలో 96.0, దర్శిలో 64.52శాతం పాసయ్యారు.
- హైస్కూలు ప్లస్‌లో 48 మందికిగాను 34మంది (70.8శాతం) ఉత్తీర్ణులయ్యారు. పాకల, హెచ్.నిడమానూరు, కొణిజేడు హైస్కూలు ప్లస్‌లలోని విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించారు.
- కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల నుంచి 197 మంది పరీక్షకు హాజరుకాగా 153 మంది (77.66శాతం) పాసయ్యారు. పెద్దారవీడు, పుల్లలచెరువు, సీఎస్‌పురం, అర్ధవీడు, బేస్తవారపేట, దొనకొండ, ముండ్లమూరు, పొన్నలూరు, రాచర్ల కేజీబీవీల్లో అధిక ఉత్తీర్ణత సాధించారు.
- ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలకు సంబంధించి 97 మంది పరీక్షకు హాజరు కాగా 63 మంది (66.9శాతం) పాసయ్యారు. కంభం, కొండపి, చీమకుర్తి అధిక ఉత్తీర్ణత సాధించారు.
- ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నుంచి 12 మందికి గాను 9మంది పాసయ్యారు.
- ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 4,046 మంది పరీక్షకు హాజరు కాగా 2,286 మంది (59.5 శాతం)ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షల ఉత్తీర్ణత వివరాలను బోర్డు ఆర్ఐవో సైమన్ విక్టర్ ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు.



ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డిపై వేటు

- వీఆర్‌కు పంపిన ఉన్నతాధికారులు
- ఎన్నికల సమయంలో ఆయనపై ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన టీడీపీ

నేడు జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష



ఒంగోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి బుధవారం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో ఉదయం పది గంటలకు ఈ సమావేశం జరగనుంది. సాధారణంగా మంత్రివర్గంలో జిల్లా నుంచి ఎంపికైన మంత్రితో అధికారుల పరిచయ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహిస్తారు. అందుకోసం మంత్రి ప్రమాణస్వీకారం అనంతరం జిల్లాకు తొలిసారి వచ్చిన సమయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ ప్రకారం బుధవారం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్ వ్యవసాయ అవసరాలు, తాగునీరు, వ్యాధులు ప్రబలే అవకాశాలు, నివారణ చర్యలు, గురువారం జిల్లాలో కేంద్ర బృంద పర్యటనకు సంబంధించిన అంశాలపై మంత్రి స్వామి అధికారులతో సమీక్షించి తగు ఆదేశాలు ఇవ్వనున్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18: పీఎం కిసాన్ 17వ విడత నిధులను ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం విడుదల చేశారు. ఈ పథకం ద్వారా జిల్లాకు సంబంధించి 2,42,851 లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున రూ.48.57కోట్లు జమ చేశారు. వ్యవసాయశాఖ కమిషన్ ఆదేశాలతో జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో మోదీ నిధుల విడుదల చేసిన కార్యక్రమాన్ని వీక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు తాలూకా సీఐపై వేటు

వీఆర్‌కు పిలుపు ● మెడికల్ లీవ్‌లో వెళ్లిన భక్తవత్సలరెడ్డి

ఒంగోలు క్రైం, జూన్ 18: ఒంగోలు తాలూకా సీఐగా పనిచేస్తున్న భక్తవత్సలరెడ్డిపై వేటు పడింది. ఈమేరకు మంగళవారం గుంటూరు రేంజ్ కార్యాలయానికి పిలిచి వీఆర్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. గత ఎన్నికల సందర్భంగా భక్తవత్సలరెడ్డి పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒంగోలు నగరం సమతానగర్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడిచేసిన కేసులో ఏకపక్షంగా వ్యవహరించి బాధితులపై కేసులు నమోదు చేయడం పట్ల టీడీపీ నాయకులు అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వెంగముక్కలపాలెంలో ఎన్నికల రోజు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యారెడ్డి పోలింగ్‌బూత్‌లో చొరబడి టీడీపీ కార్యకర్తలపై దాడిచేస్తే కేసులు నమోదు చేయలేదని అప్పట్లో ఎస్పీతో పాటూ ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అక్కడ టీడీపీలో ఉన్న దళిత కార్యకర్తలపై ఆమె దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఆ పార్టీ నాయకులు అప్పట్లోనే భక్తవత్సలరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారులు భక్తవత్సలరెడ్డిని వీఆర్‌కు పిలిచారు. అయితే మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

రక్తదానం ప్రాణాదానంతో సమానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అతిథులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 18: రక్తదానం ఆపదో ఉన్న ఎంతో మందికి ఉపయోగపడి వారి ప్రాణాలను కాపాడుతుందని పలువురు పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని రెడ్‌క్రాస్ భవనంలో సీఐటీయూ, ఏపీ ఎంఎస్‌ఆర్‌యూ కమిటీల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.రవీంద్రనాథ్, డాక్టర్ ఎస్.ఉదయిని, డాక్టర్ చాపల వంశీకృష్ణ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ చాలా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతో మంది బాధితులు ఇబ్బంది పడుతున్నారని, అటువంటి వారికి శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి రక్తదాన శిబిరాలు మరింత ఎక్కువగా నిర్వహించాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఉదయిని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జీవీ.కొండారెడ్డి, పి.కల్పన, బంకా సుబ్బారావు, పి.ఆంజనేయులు, జీవీ.రాగయ్య, ఉబ్బా ఆదిలక్ష్మి, నగర కార్యదర్శి టి.మహేష్, తంబి శ్రీనివాసులు, దామా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 8గంటలకు స్థానిక మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సాంఘిక సంక్షేమశాఖ, సచివాలయాలు, గ్రామవలంటీర్ల శాఖల మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామి జిల్లా అధికారులతో నిర్వహించే సమావేశానికి మాగుంట హాజరవుతారు.

రేపటి నుంచి కెరీర్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ

ఒంగోలు(విద్య), జూన్ 18 : జిల్లాలో ఎంపిక చేసిన 20 పాఠశాలల్లో కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై ఈనెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు హెచ్‌ఎంలు, టీచర్లకు ఒంగోలులోని నెక్స్ జెన్ స్కూలులో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న పాఠశాల హెచ్‌ఎంలు, 10,12 తరగతులు బోధించే టీచర్లు, 21న 9,11 తరగతులు బోధించే టీచర్లు, 22న 8వతరగతికి బోధించే టీచర్లు శిక్షణకు హాజరుకావాలన్నారు. ఈ శిక్షణ ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని, ఎవరికీ మినహాయింపు లేదని ఆమె పేర్కొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న తహసీల్దార్


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

నాగులుప్పలపాడు, జూన్ 18 : నాగులుప్పలపాడు గ్రామంలోని దేవదాయశాఖకు చెందిన చెరువులోని మట్టిని మంగళవారం గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ వ్యవసాయ పొలాల్లో గండ్లు పూడ్చుకునేందుకు, ఇండ్ల స్థలాలకు మెరకలు, ఇతర అవసరాలకు ట్రాక్టర్లతో తరలిస్తుండగా తహసీల్దార్ అద్దేటి శ్రీనివాసరావు, రెవెన్యూ, పోలీసు అధికారులను పంపించి నిలిపివేశారు. దాంతో రైతులు మూకుమ్మడిగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా మట్టి తరలించకూడదని తహసీల్దార్ రైతులకు సూచించారు. దేవదాయ, రెవెన్యూ శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. దీతో రైతులు మట్టి తరలింపును అనుమతులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గూడూరు ఝాన్సీ, కల్లూరి రవి, ఉప్పుటూరు హరినాథ్, చిలుకూరి వెంకట్రావు, ఉన్నం వెంకట్రావు, మున్నంగి వెంకటేశ్వర్లు, తోకల వెంటేశ్వర్లు, తుమ్మల రామారావు, కట్టా ఆంజనేయులు, కట్టా సందీప్, కట్టా శేషారావు, గూడూరు వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



పిడుగుపడి మృతి చెందిన గేదె

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 18 : ఒంగోలు నగరం దశరాజుపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన పిడుగులతో కూడిన వానకు గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మాలెంపాటి వెంకటసుబ్బారావుకు పొలంలో పశువులు మేపుతుండగా ఒక్కసారిగా భారీగా ఉరుములు, మెరుపులు రావడంతోపాటు పిడుగు పడింది. దీంతో ఏడవ నెల సూడిగేదె మరణించడంతో బాధిత కన్నీరుమున్నీరు అయ్యాడు. దీని విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గత రెండు సంవత్సరాల క్రితం పలు ప్రమాదాల్లో ఆరు గేదెలు చనిపోయాయని వాపోయారు.

సర్వాంతర్యామి శ్రీవేంకటేశ్వరుడు

ఒంగోలు(కల్చరల్), జూన్ 18: కలియుగ ప్రత్యక్షదైవంగా కొలిచే శ్రీవేంకటేశ్వరుడు సర్వాంతర్యామి అని, భక్తిగా కొలిచే వారి కోర్కెలు నెరవేర్చే కొంగుబంగారు అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు డాక్టర్ రామచంద్రుని రమేష్‌కృష్ణ పేర్కొన్నారు. స్థానిక శ్రీగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. కాగా బుధవారం ఉదయం స్వామివారి కళ్యాణం, సాయంత్రం తిరువీధి ఉత్సవం, స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాటం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

వెంకటరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18: ప్రజాకళాకారుడు, పౌరహక్కుల నేత గాండ్ల వెంకటరావు వర్ధంతిని ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. జాలన్న అధ్యక్షతన వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), ఎన్‌టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, పాటిబండ్ల ఆనందరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చుండూరి రంగారావు హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ రంగాల ప్రతినిధులు గాండ్ల శ్రీనివాసులు, ఎల్.రాజశేఖర్, పీవీఆర్.చౌదరి, పొన్నూరి వెంకటశ్రీనివాసులు, కోటి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం

నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలా కృషి ● రామాయపాలెం సభలో మంత్రి స్వామి


మంత్రి స్వామి, సత్యలను సత్కరిస్తున్న గ్రామస్థులు

మర్రిపూడి, జూన్ 18: పేదల అభ్యున్నతే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాలశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. అందుకోసం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు పలు నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. మండలంలోని రామాయపాలెంలో సోమవారం రాత్రి జరిగిన అభినందన సభలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అవ్వాతాతల పింఛన్‌ను 4వేలకు పెంచడమే కాకుండా దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రైతులపాలిట అశనిపాతంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేసి అన్నదాతలకు భరోసా కల్పించామని చెప్పారు. నిరుద్యోగ యువతీయువకుల్లో నైపుణ్యాభివృద్ధికి స్కిల్ సెన్సస్‌కు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. 16వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలి సంతకం చేశారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నారన్నారు. మారుమూల రామాయపాలెం గ్రామానికి నాలుగువైపుల పక్కా రహదారులు నిర్మించిన ఘనత టీడీపీకి దక్కుతుందని స్వామి చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తారని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయానికి అన్ని విధాలా కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య మాట్లాడుతూ 25ఏళ్ల తరువాత కొండపి నియోజకవర్గానికి, నిజాయతీపరుడైన స్వామికి మంత్రి పదవి రావడం అభినందనీయమన్నారు. యువనేత నారా లోకేష్ సారథ్యంలో నియోజకవర్గ అభివృద్ధికి తామిద్దరం అహర్నిశలూ కృషి చేస్తామని చెప్పారు. కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అంతకు ముందు పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంత్రి స్వామి పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు శేష వస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు.

స్వామికి బ్రహ్మరథం

మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారి మండలంలోని రామాయపాలెం వచ్చిన మంత్రి స్వామికి పార్టీ కార్యకర్తలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. గ్రామ సర్పంచ్ బలసాని నాగేశ్వరరావు, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బలసాని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం పౌర సన్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ తుళ్లూరి నరసింహారావు, నియోజకవర్గ సమన్వయకర్త రేగుల వీరనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ వైపు పెద్దిరెడ్డి చూపు..!

గోడ దూకేందుకు ఏడుగురు వైసీపీ ఎమ్మెల్యేలు సిద్ధం

మంత్రి స్వామి సంచలన వ్యాఖ్యలు

మర్రిపూడి, జూన్ 18 : శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేయకముందే మాజీ మంత్రి పాపాల పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఏడుగురు వైసీపీ ఎమ్మెల్యేలు గోడ దూకేందుకు సిద్ధమయ్యారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. మర్రిపూడి మండలం రామాయపాలెంలో సోమవారం రాత్రి జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. అధికారం కోల్పోయి పట్టుమని పదిరోజులు కాకముందే వైసీపీ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూస్తున్నారని ఆయన అన్నారు. టీడీపీలో చేర్చుకోరన్న విషయాన్ని గుర్తించి పెద్దిరెడ్డి ఢిల్లీ వైపు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన 23 మందిలో నలుగురిని వైసీపీ లాగేసుకున్నా మిగిలిన 19మంది శాసనసభ్యులం చంద్రబాబు సారథ్యంలో అలుపెరుగని పోరాటం చేశామని గుర్తు చేశారు. చంద్రబాబును 53 రోజులపాటు జైల్లో నిర్బంధించడంతో టీడీపీ కార్యకర్తల్లో కసి, పట్టుదల పెరిగిందన్నారు. ఎన్నికల్లో నరకాసుర వధ జరిగిందని, దేవుడు రాసిన స్క్రిప్ట్ వైసీపీని కేవలం 11 సీట్లకే పరిమితం చేసిందని మంత్రి ఎద్దేవా చేశారు. ఆ పార్టీని సజీవంగా చంపేసిందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే దామచర్ల


ఎమ్మెల్యే జనార్దన్ సత్కరిస్తున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు


దామచర్లకు తమ సమస్యలను వివరిస్తున్న మహిళలు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 18: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అన్ని వేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో తనను కలవడానికి విచ్చేసిన ప్రజలతో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా నగరంలో పారిశుధ్యం, తాగునీటి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. అలాగే నగరంలో విలీనమైన గ్రామాలలో సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తనను కలవడానికి విచ్చేసిన పలువురు నాయకులు, అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఆయా శాఖలతో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహించి, పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ దామచర్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు సత్కారం

ఒంగోలు(కలెక్టరేట్): ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్లను సంఘం అధ్యక్షుడు బడే అంకిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కంచర్ల సుబ్బారావుల ఆధ్వర్యంలో కలిసి శాలువతో సత్కరించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం దామచర్ల మాట్లాడుతూ పెన్షనర్లకు ఒకటో తేదీనే పింఛన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో మన్నం హనుమంతరావు, డి.వెంకటేశ్వర్లు, మారెళ్ళ వెంకట్రావు, శ్రీరామమూర్తి, ప్రభాకరరావు, ఓవీఎస్‌ఆర్‌ప్రసాద్, ఎన్.శరత్‌బాబు, ఎ.రత్నాకర్, బి.శేషయ్య పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో బీఎన్ పూజలు

పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు

ఎమ్మెల్యే విజయకుమార్ ఆఫీసు వద్ద రద్దీ


పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎన్, నాయకులు

ఒంగోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి)/సంతనూతలపాడు: ఒంగోలు నగరం మంగమూరురోడ్డు మర్రిచెట్టుకాలనీ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం జరిగిన ప్రత్యేక పూజలకు సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్.విజయకుమార్ హాజరయ్యారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం నేపథ్యంలో గుమ్మళంపాడుకు చెందిన పి.కోటేశ్వరరావు 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు చేయిస్తానని మొక్కుకున్న సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ పాల్గొని పూజలు చేశారు. టీడీపీ ముఖ్యనేతలు అడకా స్వాములు, మద్దినేని హరిబాబు, కాకర్ల లక్ష్మీప్రసాద్, జనసేన నగర అధ్యక్షుడు ములగా రమేష్, ఎమ్.రమేష్, ఎడ్లపల్లి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే మర్రిచెట్టు సమీపంలోని ఎమ్మెల్యే విజయకుమార్ కార్యాలయం వద్ద తీవ్ర రద్దీ నెలకొంది. వివిధ గ్రామాల టీడీపీ నేతలు భారీగా తరలివచ్చి అభినందనలు తెలపడంతో పాటు తమ గ్రామాల్లో సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే పలు శాఖల అధికారులు కలిశారు. ఆర్డీవో సుబ్బారెడ్డి బుధవారం ఉదయం ఎమ్మెల్యే బీఎన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే పలు మండలాలకు చెందిన అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నాటకరంగం ముద్దుబిడ్డ నాగినేని


నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 18: నాటకరంగంలో సంగీతం, సాహిత్యం, నాట్యం, నటన , రచన, దర్శకత్వం వంటి అన్ని విభాగాలలో తిరుగులేని విధంగా అత్యంత ప్రతిభను చాటిన గొప్ప వ్యక్తి నాగినేని నరసింహారావు అని పలువురు కళాకారులు కొనియాడారు. ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో మంగళవారం సాయంత్రం ప్రముఖ హార్మోనిస్టు నాగినేని నర్సింహారావు 16వ వర్ధంతి సభ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కవులు, కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు సంచాలకత్వంలో, కార్యదర్శి కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ రంగస్థల నటులు పరాంకుశం కేశవాచార్యులు మాట్లాడుతూ నాటకరంగ బలోపేతానికి నర్సింహారావు చేసిన కృషి అనన్య సామాన్యమైనదన్నారు. నాగభైరవ సాహితీపీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ 50 సంవత్సరాల సుదీర్ఘకాలం జిల్లా నాటకరంగానికి సేవలందించిన చిరస్మరణీయులు నాగినేని నర్సింహారావు అని కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నవరసాలను అలవోకగా పోషించగలిగిన గొప్ప నటుడు నర్సింహారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మిట్నసల శాంతారావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, గుంటూరు సత్యనారాయణ, ఐనంపూడి నర్సింహారావు, వేముల సాంబమూర్తి, కొప్పోలు వెంకటేశ్వర్లు, నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపు ఏర్పాటుకు లంచం అడుగుతున్నారు..!

ఏపీఎంకు టీడీపీ నాయకుల ఫిర్యాదు


ఏపీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంతనూతలపాడు, జూన్ 18: సంతనూతలపాడు మండలంలో డ్వాక్రా కొత్త గ్రూపు ఏర్పాటుకు వెలుగు కార్యాలయంలో సీసీ రూ.3వేలు లంచం డిమాండ్ చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై మండల ఏపీఎం సుధాకర్‌కు మంగళవారం ఫిర్యాదుచేశారు. లంచాలు ఇస్తేనే డ్వాక్రా కొత్త గ్రూపుల ఏర్పాటుకు అనుమతులు ఇస్తారా అని ప్రశ్నించారు. దీనిపై సరైన సమాధానం దొరక్కపోతే కలెక్టర్‌కు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అదేవిధంగా అభయహస్తం, సీఐఎఫ్, పీవోపీ, శ్రీనిధి లోనుల్లో సైతం అక్రమాలు జరిగాయాని, వాటికి సంబంధించి వివరాలు అడిగి పది రోజులపైన అవుతోందని, ఇంతవరకు వివరాలు ఇవ్వకపోవడంపై ఏపీఎం సుధాకర్‌ను టీడీపీ నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా సీసీపై తగిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బాధితులతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆరు హెచ్చరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు నార్నే మాధవి, నా యకులు ఎం.సతీష్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మంత్రిని కలిసిన కలెక్టర్


మంత్రి స్వామిని సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్)/టంగుటూరు, జూన్ 18 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామిని కలెక్టర్ దినేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం గ్రామంలో మంత్రి నివాసంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ దినేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి స్వామిని శాలువతో సత్కరించి బొకే అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలను మంత్రితో కలెక్టర్ చర్చించారు.

మంత్రి లోకేష్‌కు శుభాకాంక్షలు


మంత్రి లోకేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, జూన్ 18: మంగళగిరిలో ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర పార్టీ సెక్రటరీ అడకా స్వాములు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సురేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన కమ్మ సామాజిక విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18: వెనుకబడి, మధ్యతరగతి కమ్మ సామాజికవర్గ కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం కోసం వివిధ విద్యా సంస్థల్లో ప్రత్యేక ఫీజు రాయితీ, వసతి ఏర్పాటు కల్పిస్తున్నట్లు కమ్మ సేవా సమితి అధ్యక్షుడు, సోషల్ మీడియా అడ్మిన్ అధ్యక్షుడు చిమ్మిరి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ సంస్థలో వెయ్యి మందిపైగా సభ్యులు ఉన్నారన్నారు. ఇటీవల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసుకొని కమ్మసేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు. కమ్మసామాజిక వర్గానికి చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పూర్తి వివరాల కోసం 9848157923 సెల్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

దేవదాయశాఖ మంత్రికి సత్కారం


మంత్రి ఆనంను సత్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18 : దేవదాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శాలువతో సత్కరించారు. నెల్లూరులోని ఆనం స్వగృహంలో మంగళవారం ఎంపీ మాగుంట మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంను ఘనంగా సత్కరించారు. అనంతరం నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంటను శ్రీధర్‌రెడ్డి సత్కరించారు.

కూటమి విజయంతో మొక్కు చెల్లింపు

నాగులుప్పలపాడు, జూన్ 18 : ఎన్నికల్లో కూటమి విజయంతో ఒమ్మెవరం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షులు కొమ్మాలపాటి సురేష్ శ్రీశైలంలోని మల్లికార్జునస్వామికి మంగళవారం మొక్కు చెల్లించుకున్నారు. అలాగే ఎమ్మెల్యేగా బీఎస్.విజయ్‌కుమార్ గెలుపొందడంతో తలనీలాలు సమర్పించారు.

రేపు ఐటీఐ విద్యార్థులకు జాబ్‌మేళా

ఒంగోలు(విద్య) జూన్ 18: ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో గురువారం ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్, ఐటీఐ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని ఐటీఐ పాసైన విద్యార్థులు, అప్రంటిస్ షిప్ ఇండియా పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో ఈ మేళాలో పాల్గొనాలని, వివరాలకు 9703165456 సెల్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న అప్పారావు

మద్దిపాడు, జూన్ 18: విద్యతోనే బంగారు భవిష్యత్ సాధ్యమని నందిపాడు సొసైటీ మాజీ ఛైర్మన్ పూనాటి అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం సీతారాంపురం బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మారెళ్ల పూర్ణచంద్రరావు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో మారెళ్ల పావని, మారెళ్ల లక్ష్మీనారాయణ, గోవిందరాజులు, వేణుగోపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మద్దిపాడు, జూన్ 18: నందిపాడు గ్రామంలో వేంచేసిన గంగాపార్వతీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి భక్తుల పాలిట కొంగుబంగారంగా పూజలందుకుంటున్నారు. సాక్షాత్తు కాశీ విశ్వేశ్వరుడే ఇక్కడ కొలువుదీరాడని పురాణాలు చెబుతున్నాయి. స్వామిని దర్శిస్తే ఎన్ని కష్టాలైనా తొలగిపోతాయని భక్తు ప్రగాఢ విశ్వాసం. ఈక్రమంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 19వ తేదీన అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. 20న స్వామివారికి బలిహరణ, 21, 22 తేదీల్లో విశేష పూజలు, 23న స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నట్లు మంగళవారం దేవదాయశాఖ అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు రాజు పంతులు తెలిపారు. 24, 25 తేదీలలో ఏకాంత సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సేవ, వ్యక్తిత్వ వికాసం జేసీఐ లక్ష్యం



మాట్లాడుతున్న జేసీఐ నాయకులు

ఒంగోలు(కల్చరల్), జూన్ 18: సమాజానికి అవసరమైన సేవ చేయటం, యువతలో వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయటం జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) లక్ష్యమని జేఎఫ్ఎస్ అడ్వకేట్ రాకేష్‌శర్మ పేర్కొన్నారు. ఒంగోలులోని ఓ రెస్టారెంట్‌లో జేసీఐ అధ్యక్షులు కేవీ.వరుణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాకేష్‌శర్మకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒంగోలు జేసీఐ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేయటం, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించటంలో ముందుందని అభినందించారు. ఈ సందర్భంగా తోపుడు బండ్లవారికి గొడుగులను పంపిణీ చేశారు. పేద విద్యార్థుల జాతీయ నిధికి తాడేపల్లి రవికుమార్ రూ.33వేలు, పి.రామాంజనేయులు, కేవీ.వరుణ్‌కుమార్, పి.నందకుమార్, కె.శివారెడ్డి రూ.17వేలు జాతీయ అధ్యక్షులు రాకేష్‌శర్మ, జోన్ ప్రెసిడెంట్ కృష్ణభాస్కర్, జోన్ వైస్‌ప్రెసిడెంట్ తేజస్వినిలకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి కృష్ణారావు, సూరే ఏడుకొండలు, కసిబిసి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


పుస్తకాలను అందిస్తున్న దుర్గాభవానీ, అనిల్‌యాదవ్

మద్దిపాడు, జూన్ 18: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీటీసీ సభ్యురాలు అద్దేపల్లి దుర్గాభవాని పేర్కొన్నారు. మంగళవారం వెల్లంపల్లిలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్‌ను అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వసుందరదేవి, సర్పంచ్ అనిల్‌యాదవ్, జి.రవికుమార్, ఆర్.సుబ్బారావు, డి.సీతాలక్ష్మి, సీహెచ్.సుబ్బారావు, డి.సురేష్ పాల్గొన్నారు.

కందుకూరు, అద్దంకిలను ప్రకాశం జిల్లాలో కలపాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18 : కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ మిరియం శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతానని హామీ ఇచ్చినందున ఆ చర్యలను తీసుకోవాలన్నారు. అలాగే మార్కాపురంను జిల్లాకేంద్రంగా ప్రకటించాలని ఆయన కోరారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.332



కొనసాగుతున్న పొగాకు వేలం

టంగుటూరు, జూన్ 18 : టంగుటూరు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.332 పలికింది. శివపురం, మల్లవరప్పాడు, మట్టిపాడు, గొర్లమిట్ట గ్రామాల రైతులకు చెందిన 973 బేళ్లను వేలానికి అనుమతించారు. వాటిలో 898 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 75 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కనిష్ఠ ధర రూ.205 లభించింది. సరాసరి ధర రూ.282.46 దక్కింది. 22 కంపెనీల బయ్యర్లు వేలంలో పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించండి

మంత్రి స్వామిని కోరిన విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు



స్వామిని సత్కరిస్తున్న ప్రతినిధులు

టంగుటూరు, జూన్ 18 : రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లకు నూతన భవనాలను నిర్మించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామిని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ కోరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని స్వగృహంలో ఉన్న మంత్రి స్వామిని టీడీపీ నేతలతోపాటు ఆయన మార్యదపూర్వకంగా కలిశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలను మెరుగుపరచాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత మండవ మురళీకృష్ణ, సుబ్బారావు, దుగ్గినేని సుబ్బారావు పాల్గొన్నార

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



షేక్ దరియావలి మృతదేహం

పంగులూరు, జూన్ 18 : మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండమూరుకు చెందిన షేక్ దరియావలి (24) మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుపతిరావు అందించిన సమాచారం మేరకు.. కొండమూరు గ్రామానికి చెందిన షేక్ దరియావలి ద్విచక్ర వాహనంపై ముప్పవరంవైపు వెళుతూ రేణంగివరం సమీపంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. బేల్దారీ పనులు చేస్తూ జీవనం సాగించే దరియావలికి ఏడాది క్రితమే వివాహమైంది. గర్భవతి అయిన భార్యను సోమవారం చిలకలూరిపేటలోని పుట్టింటి వద్ద వదిలిపెట్టి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో బ్రిక్స్ లోడుతో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దరియావలి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్‌ఐ తిరుపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించిన పోలీసులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూన్ 18 : మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చెందారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ సమీపంలో చో టుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌కే కాశిం సాహెబ్(58)కు భార్య గుల్జార్, కుమారుడు బాజీ మరో కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి. వీరిది హై స్కూల్ ఎదురు కూల్‌డ్రింక్ షాపు, లూజు పెట్రోల్‌ను విక్ర యిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. కొంత కాలంగా సాహెబ్ అనారోగ్యంబారిన పడ్డా రు. వైద్యం పొందుతున్నారు. ఆరోగ్య విషయాన్ని విస్మరించి సిగరెట్లు, బీడీలు తాగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాహెబ్ అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా బాత్ రూంలోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించు కున్నారు. ఈపూరుపాలెం ఎస్‌ఐ శివకుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బాత్‌రూంలో స్విచ్ బోర్డులు కాలిపోయి ఉన్నాయి. దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయారా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడున్న పెట్రోల్ డబ్బా, అగ్గి పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. చీరాల ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

సూర్యప్రభ, హంసవాహనాలపై విహరించిన స్వామివారు

సింగరాయకొండ, జూన్ 18 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం దేవస్థానంలోని మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి, యోగనంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని ప్రత్యేక పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై ప్రత్యేక పూలతో అలంకృతుడైన స్వామివారిని మోతకాపులు గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. గ్రామస్థులు తమ వాకిళ్ల ఎదుట రంగవల్లులు వేసి హారతులు పట్టారు. రాత్రికి స్వామివారు హంస వాహనంపై గ్రామ వీధులో విహరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, యాజ్ఞకం సుదర్శనాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పొట్టేళ్లు, రేపు ఎడ్ల పోటీలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పొట్టేళ్ల, ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణయాదవ యూత్‌ఫోర్స్ కమిటీ సభ్యులు తెలిపారు. 19వతేదీ సాయంత్రం పొట్టేళ్ల పోటీలు ఉంటాయన్నారు. విజేతలుగా నిలిచిన పొట్టేళ్ల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేల నగదు అందజేస్తామన్నారు. 20వ తేదీ సాయంత్రం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతులుగా రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, ఆరో బహుమతిగా రూ.12వేలు అందజేస్తామన్నారు. 21వ తేదీన రాష్ట్రస్థాయి రాదాడి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు నగదును అందజేస్తామన్నారు. వివరాలకు సెల్ నెంబర్లు : 89198 98055, 98480 48499, 93912 81118ను సంప్రదించాలని నిర్వాకులు కోరారు.



హంసవాహనంపై విహరిస్తున్న వరాహ లక్ష్మీనరసింహుడు



ఎడ్ల పందేలకు సిద్ధమైన ప్రాంగణం

శరవేగంగా రైల్వే లైన్ పనులు

- సాకారంకానున్న కనిగిరి ప్రజల చిరకాల స్వప్నం
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 18: ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కనిగిరి ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసిం హారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కలగట్ల గ్రామం వద్ద శరవేగంగా జ రుగుతున్న నడికుడి - రైల్వేలైన్ పనులను మంగళవారం ఆయన పరిశీలిం చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైల్వేమార్గం పనులు చురుకుగా జరు గుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైల్వే మార్గం నిర్మాణ పనులు మరింత వేగంగా జరిగే అవకాశముందన్నారు. కలగట్ల గ్రా మ సమీపంలో జరుగుతున్న రైల్వే పనులు ప్రారంభదశలో ఉన్న ఈత రుణంలో కనిగిరి ప్రాంత ప్రజలకు అనుగుణంగా మార్పులు, చేర్పుల విష యంపై అవగాహన కోసం పనులు పరిశీలించినట్లు తెలిపారు. నిర్మాణం లో చిన్నచిన్న లోపాలను కూడా సరిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైల్వేలైన్ నిర్మాణ జరిగి రైల్వేస్టేషన్ ఏర్పడితే కనిగిరి ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతున్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, జంషీర్, గుడిపాటి ఖాదర్, తమ్మినేని శ్రీను, సిద్దాంతి బారాయి మాం, సైకం మాలకొండారెడ్డి, షరీఫ్, కేవీఎస్ గౌడ్, ఐవీ నారాయణ, తది తరులు పాల్గొన్నారు.



రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

టీడీపీ ఫ్లెక్సీని చింపిన గుర్తుతెలియని వ్యక్తులు



చించేసిన ఫ్లెక్సీ

కురిచేడు, జూన్ 18 : మండలంలోని గంగదొన కొండలోని గంగాభవాని ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీ వారు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మితో కూడిన పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చింపి ఆలయంలో పడవేశారు. ఈవిషయమై గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చీరాల రైల్వేస్టేషన్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

చీరాలటౌన్, జూన్ 18 : చీరాల రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం-4లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ప్లాట్‌ఫాంపై వేసిన షెడ్డు పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు రేకులకు తగిలి ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటల వ్యాపించాయి. అదే సమయంలో ప్లాట్‌ఫాం నెం-5లో గూడూరు - విజయవాడ ప్యాసింజర్ రైలు ఆగి ఉంది. ఈ ఘటనతో ప్రయాణికులు కలవరపడ్డారు.

ప్రతి వారం ఇసుక నిల్వల తనిఖీ

మేదరమేట్ల, జూన్ 18 : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇసుక నిల్వలను పరిశీలించి నివేదికలను అందజేస్తున్నామని మైనింగ్ డీఏ తిరుపతిరావు తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం అనమనమూరు వద్ద ఇసుక నిల్వలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఎక్కడా ఇసుక తవ్వకాలు చేయొద్దన్నారు. అక్రమంగా ఇసుక తవ్వినా, రవాణా చేసిన చర్యలు తప్పవని డీఏ హెచ్చరించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

బార్ అసోసియేషన్ ప్రతినిధుల సంబరాలు

చీరాలటౌన్, జూన్ 18 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ హర్షణీయమని, ప్రజా క్షేమకరమైన నిర్ణయాలు టీడీపీతోనే సాధ్యమని పలువురు బార్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంబంధిత పత్రాలపై సంతకం చేశారు. దీంతో మంగళవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కేక్ కటింగ్ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. యజమానులు వారి కష్టార్జితంతో సంపాదించుకున్న ఆస్తులు దుర్వినియోగం కాకుండా యాక్టును రద్దు చేయడం హర్షించదగిన అంశమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాదులు ఉదయ భాస్కర్, మణి నాగశయన, సాయిబాబు, రమేష్ కుమార్, రవికుమార్, కస్తూరి, పవన్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



కేక్ కటింగ్ నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

పిడుగుపడి గొర్రెల కాపరి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

మార్టూరు, జూన్ 18 : పిడుగు పాటుకు పొలంలో గొర్రెలను మేపుతున్న గోవాడ శ్రీనివాసరావు (52) మృతిచెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మండలంలోని జొన్నతాళి గ్రామ పొలాల్లో జరిగింది. జొన్నతాళికి చెందిన శ్రీనివాసరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉ న్నారు. మంగళవారం గొర్రెలను మేపడానికి శ్రీనివాసరావు పొలానికి వెళ్లాడు. దాదాపుగా 2 గంటల సమయంలో ఆకాశంలో ఉరుములు మె రుపులతో భారీ వర్షం కురిసింది. దాంతో అతను గొర్రెలను వేరేచోటకు పం పించి సమీపంలో ఉన్న జమి చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డాడు. ఈ సమయంలో పెద్దశబ్దంతో ఉరుములతో కూడిన పిడుగు ఆకాశం నుంచి చెట్టుపై నుంచి అతని భుజంపై ప డింది. దాంతో అక్కడికక్కడే చనిపోయారు. అదే సమయంలో దూరంగా నిలుచున్న పిల్లవాడు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందడంతో కుటుంబసభ్యులు పొలానికి వెళ్లి అతని మృతదేహాన్ని ఇం టికి తీసుకువచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యుడు అతనిని పరీక్షించి చనిపోయినట్లు ని ర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుప్పకూలిన కుటుంబ సభ్యులు

సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసరావుకు రెండెకరాలు పొలం ఉంది. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కౌలుకు కూడా పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. భార్య మల్లీశ్వరి కుమారుడు తిరుపతిరాయుడు, కుమార్తె అనూరాధ డిగ్రీ చదువుతున్నా కూడా పొలం పని చేస్తుంటారు. శ్రీనివాసరావుకు ఆర్థిక ఇబ్బందులున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనివాసరావు మృతితో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తమకు దిక్కెవరని విలపిస్తున్నారు. ప్రభుత్వం శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని, అండగా ఉండాలని గ్రామస్థులు కోరారు.

యువకులపై ఎస్‌ఐ దురుసు ప్రవర్తన

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

అద్దంకి, జూన్ 18 : పోస్టుమార్టంకు తీసుకొచ్చిన మృతదేహం తరపు యువకులపై రేణింగవరం ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తుంది. రేణింగవరం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంగులూరు మండలం కొండమూరుకు చెందిన వ్యక్తి మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. ఈ నేపథ్యంలో రేణింగవరం ఎస్‌ఐ తిరుపతిరావు మంగళవారం మధ్యాహ్నం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఆ సమయంలో మృతి చెందిన వ్యక్తి తరపు యువకులు ఎస్‌ఐతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తులను ఎందుకు అరెస్ట్ చేయలేదన్న విషయమై వాదన జరిగినట్లు తెలిసింది. దీంతో వాగ్వివాదానికి దిగిన యువకుడిపై ఎస్‌ఐ చేయిచేసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనలను ముప్పవరానికి చెందిన ఓ యువకుడు సెల్‌ఫోన్ లో వీడియో తీశాడు. దీంతో ఎస్‌ఐ మరింత కోపోద్రిక్తుడై వీడియో తీసిన యువకుడుపై కూడా దురుసుగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. అదే సమయంలో ఆ యువకుడి సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఎస్‌ఐ తిరుపతిరావుపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఆ యువకుడు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తుంది.

ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల

- ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దర్శి తహసీల్దార్ కార్యాలయం

దర్శి జూన్ 18: అధికారులు ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకున్న ట్లు క నిపించ టం లేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి పది రోజులు అవుతు న్న ప్పటికీ కొంతమంది అధికారులు ఇంకా కార్యాలయాల ము ఖం చూడలేదు. వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు అధికారులు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటివరకు అధికారులు అందుబాటులోకి రాలేదు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావటంతో వ్యవసాయ రుణాలు తీసుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆన్‌లైన్ రికార్డులు తప్పనిసరిగా కావాల్సి ఉంది. ఈనేపథ్యంలో అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మినహా మిగిలిన అధికశాతం మంది అధికారులు అందుబాటులో లేరు. ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈనెలలో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదు. అధికారులు పట్టించుకోకపోవటంతో అరకొరగా పంపిణీ చేసి 10వ తేదికి ముగించారు. అధికశాతం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావటంతో నాయకులు అధికారులను ప్రక్షాళన చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులను, వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారులను తక్షణమే పంపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
రీజనల్ ఆఫీస్, ఒంగోలు

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను వారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలు **ది.29-06-2024 శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, మార్కెట్ సెంటర్ బ్రాంచి, భాగ్యనగర్, ఒంగోలు** ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచిన వారు **ది. 29-06-2024 శనివారం మధ్యాహ్నం 2.00 గంటలలోపు రూ.20,000/-లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలము రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా, బకాయిలు రద్దుకాని ఎడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల ఈ ప్రకటన వారి వారసులకు వర్తించును. బ్యాంకు నుండి వారి వారి ఖాతాదారులకు ఋణము చెల్లించవలసినదిగా కోరుతూ పంపినటువంటి నోటీసులు ఏ కారణము చేతనైన ఖాతాదారులకు చేరకపోయిన ఖాతాదారులు తీసుకొనకపోయిన, ఖాతాదారులు మరణించియున్న ఈ పత్రిక నోటీసును తుది నోటీసుగా భావించవలసినదిగా కోరుచున్నాము. మునుపటి నోటీసులు చేరని విషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలకు బ్యాంకు బాధ్యత వహించదు.

క్ర.సం	BIC	ఖాతా నెంబరు	శాఖ	ఖాతాదారుని పేరు	గ్రామం	తూకం గ్రా.
1	5201	91152038954	చినగంజాం	లక్ష్మీపతిరెడ్డి దోమ, తండ్రి పోతురాజురెడ్డి	మూలగానివారిపాలెం	60.4
2	5201	91152035895	చినగంజాం	లక్ష్మీపతిరెడ్డి దోమ, తండ్రి పోతురాజురెడ్డి	మూలగానివారిపాలెం	60.7
3	5092	91160006954	ఒంగోలు మార్కెట్ సెంటర్	దొడ్ల సత్యనారాయణరెడ్డి, తండ్రి రంగారెడ్డి	బాలాజీనగర్	25.6
4	5092	91177497536	ఒంగోలు మార్కెట్ సెంటర్	దొడ్ల సత్యనారాయణరెడ్డి, తండ్రి రంగారెడ్డి	బాలాజీనగర్	9.8
5	5211	91132919573	పెద్దారు	కోలా మాధవి, భర్త రోశయ్య	ధర్మవరం	20.4
6	5216	91145454420	అల్లూరు	కావల మోషే(లేట్), తండ్రి రామయ్య కావల	అంబేద్కర్‌నగర్	30
7	5197	91166907909	వలపర్ల	రామక్రిష్ణ మిన్నెకంటి, తండ్రి మోహన్‌రావు	రామ్‌కూరు	73.3
8	5197	91180503088	వలపర్ల	రామక్రిష్ణ మిన్నెకంటి, తండ్రి మోహన్‌రావు	రామ్‌కూరు	23.6

తేది : 18-06-2024
ఒంగోలు
సం/- రీజనల్ మేనేజర్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, రీజనల్ ఆఫీస్, ఒంగోలు,



కిటికీలు లేకుండా అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనం

నాడు హడావుడిగా ప్రారంభం

- నేడు టీడీపీపైనే భారం
- సౌకర్యాల లేమిలో తర్లుపాడు సచివాలయం
- ముందుగానే బిల్లులు చేసుకున్న కాంట్రాక్టర్లు

తర్లుపాడు, జూన్ 18: గతంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ, నాటి వైసీపీ పాలకులు హడావుడిగా సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఆయా భవనాల్లో కనీసం వసతులు లేనప్పటికీ, శిలాఫలకంపై పేరు కోసం ఎన్నికల వేళ ప్రారంభించి మమ అనిపించారు. పేరుకు వాటి ప్రారంభం అయితే నిర్వహించినప్పటికీ, వసతులు లేకపోవడంతో నేడు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఆ భారం కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వంపై పడింది.

ఈ ఏడాది ఫిబ్రవరి నెల 10న హడావుడిగా అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, అధికారులు తర్లుపాడు సచివాలయాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సచివాలయ భవనాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. తర్లుపాడులోని సచివాలయ భవనం కనీసం విద్యుత్ సౌకర్యం, తలుపులు, ప్రధానమైనవంటి పనులను కూడా పూర్తి చేయకుండానే ఎంతో ఆర్భాటంగా పంచాయతీ శాఖ అధికారులు, వైసీపీ నాయకులు ప్రారంభించారు. పనులు పూర్తికాకుండానే ఎలా ప్రారంభిస్తారని అప్పట్లో ప్రజలు చర్చించుకున్నప్పటికీ లెక్కచేయకుండా శిలాఫలకాలలోని పేర్ల కోసం నేతలు పాకులాడి మరి ప్రారంభించారు. ప్రారంభం తరువాతైన పనులు పూర్తి చేశారా..? అంటే అదీ లేదు. నాలుగున్నర నెలలుగా కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. దీంతో ఆ సచివాలయం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. దీంతో సచివాలయ సిబ్బంది కూడా పాత డిపెప్ పాఠశాలల్లో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

భవనాలకు బిల్లులు చెల్లింపు..!

తర్లుపాడు సచివాయంతో పాటు మండలంలోని పలు సచివాలయాలు, ఆర్‌బీకేలను పనులు పూర్తికాకముందే ప్రారంభించారు. ఇక కాంట్రాక్టర్లు కూడా పనులతో ఏం సంబంధం బిల్లులు వస్తే చాలు అన్నట్లు ముందుగానే బిల్లులు చేసుకున్నారు..! అయితే పనులు పర్యవేక్షించాల్సిన అధికారులు నాటి పాలకులకు తొత్తులుగా మారి మామూళ్ల మత్తులో మునిగి బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడు అసంపూర్తి పనులను ఎవరూ పూర్తి చేస్తారో..? వేచి చూడాల్సి ఉంది. అసంపూర్తిగా ఉన్న భవనాల ప్రారంభోత్సవానికి పంచాయతీ రాజ్ డీఈ, ఏఈ, పలు శాఖల అధికారులు కూడా పాల్గొని ప్రారంభించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న భవనాలకు బిల్లులు చేసిన అధికారులపై విచారణ జరిపి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



గ్రిల్‌లేకుండా ఉన్న కిటీకీ, ప్రారంభించిన నాటి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి(ఫైల్)

అవకతవకల అధికారులపై చర్యలు తప్పవా..?

వైసీపీ నాయకులు చెప్పిందే వేదంగా భావించి పలు భవనాలకు, పంచాయతీలోని పలు రోడ్ల నిర్మాణ పనులకు నిబంధనలతో సంబంధం లేకుండా బిల్లులు చేసిన పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులరెడ్డిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏఈ చేసిన అవకతవకలపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బాలిక వైద్యానికి చేయూత


చిన్నారికి ఆర్థిక సహాయం అందిస్తున్న బోనేని

కొమరోలు, జూన్ 18: అనారోగ్యంతో బాధపడుతున్న బాలిక జెస్నీఫర్‌కు వైద్యఖర్చుల నిమిత్తం టీడీపీ మండల అధ్యక్షుడు, అమ్మా ఫౌండేషన్ నిర్వాహకులు బోనేని వెంకటేశ్వర్లు రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. కొమరోలు మండలంలోని తాటిచర్ల గ్రామానికి చెందిన పల్లాల భాస్కర్‌రావు కుమార్తె జెస్నీఫర్ లివర్ సిర్రోసిస్ వ్యాధితో బాధపడుతోంది. జెస్నీఫర్ తండ్రి బాస్కర్ సచివాలయ లైన్‌మెన్‌గా ఒంగోలులో పనిచేస్తున్నారు. బాలిక కొమరోలు మండలంలోని తాటిచర్ల మోటు చర్చి పాఠశాలలో 10వ తరగతి ఈ సంవత్సరమే పూర్తి చేసింది. అయితే చిన్నారికి లివర్ వ్యాధి వెలుగు చూడడంతో వైద్యానికి రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబానికి తనవంతు తోడ్పాటుగా వెంకటేశ్వర్లు రూ.10 నగదు అందజేశాడు. చిన్నారి ఆరోగ్యం కుదుట పడేందుకు తనవంతు సహకారం అందజేస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అమ్మాఫౌండేషన్ సభ్యులు పాల్వాది వెంకటేశ్వర్లు, బొమ్మిని శ్రీను, మేకల నరసింహులు, కొండమ్మ, జీవనమ్మ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

గిద్దలూరు, జూన్ 18 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డులో కూరగాయల మార్కెట్ సమీపంలో విద్యుత్ తీగ తెగిపడడంతో అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిపోయింది. పగటిపూట అయితే ఆ ప్రాంతంలో కూరగాయల కోసం వందలాది మంది ఆ మార్కెట్‌కు వచ్చి వెళుతుంటారు. రాత్రిపూట కావడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గిద్దలూరు, జూన్ 18 : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గౌతవరం గ్రామంలో వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నల్లబోతుల ఆంజనేయులు (40) రైతువారి పనులు చేసుకొనేవాడు. మూడు రోజులక్రితం నర్సరావుపేటలోని తమ్ముని వద్దకు వెళుతున్నాని చెప్పి అక్కడికి వెళ్లకుండా లాడ్జి తీసుకుని అక్కడే మద్యంలో పురుగు మందు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కుటుంబ కలహాలు, మానసిక స్థితి సరిగా లేకపోవడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం ఆంజనేయులు మృతదేహాన్ని స్వగ్రామమైన గౌతవరం గ్రామానికి తీసుకుని వచ్చారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు

గిద్దలూరు టౌన్, జూన్ 18 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన ఘటన గిద్దలూరు-నంద్యాల మధ్య నల్లమల ఘాట్‌రోడ్డులో మంగళవారం చోటుచేసుకొంది. కారు-లారీ ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. ప్రమాదానికి గురైన వాహనాలను వెంటనే పక్కకు తొలగించడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోయింది.

ప్రోత్సాహకాలతో నైపుణ్యాల వెలికితీత


ప్రోత్సాహక నగదు అందజేస్తున్న హెచ్‌ఎం

కంభం, జూన్ 18 : విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రోత్సహకాలు ఎంతైనా అవసరం ఉందని, కంభం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమూల్య తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతిలో 568/600 మార్కులు సాధించిన ఆయేషాకు రూ.10వేలు, 567 మార్కులు సాధించిన రెహానాకు రూ.5వేలు, 560 మార్కులు సాధించిన అఖిలకు రూ.5వేలు అందించిన బెంగుళూరుకు చెందిన యాపిల్ సంస్థ డిజైన్ ఇంజనీర్ శివక్రిష్ణను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందచేస్తామని ప్రకటించారు.

వేధింపుల కేసు నమోదు

మార్కాపురం, జూన్ 18: పెళ్లై పదేళ్లయినా పిల్లలు పుట్టలేదని భర్త కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని తూర్పువీధికి చెందిన గుంటక వెంకటేశ్వరరెడ్డి కుమార్తె సుకన్యను 2014లో గిద్దలూరు మండలం నరవ గ్రామానికి చెందిన ఈదుల పాండురంగారెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. పది సంవత్సరాలయినా పిల్లలు లేకపోవడంతో సుకన్యను భర్త పాండురంగారెడ్డి కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. ఈ క్రమంలో మనో వ్యధకు గురైన సుకన్య కొన్నాళ్లుగా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. భర్త, అత్త, మరిది, మరో ఇద్దరు కుటుంబ సభ్యులపై సుకన్య పట్టణ పోలీసు స్టేషన్‌లో వేధింపుల విషయమై ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మార్కాపురం, జూన్ 18: పది రోజుల క్రితం ఇంట్లో నుంచి వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించడంతో మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు స్థానిక డ్రైవర్స్ కాలనీకి చెందిన విశ్రాంత వ్యాయామోపాధ్యాయులు దగ్గుల చెన్నారెడ్డికి మానసిక వికలాంగుడైన రవిశంకర్‌రెడ్డి (40) అనే కుమారుడు ఉన్నాడు. పది రోజుల క్రితం ఆరోగ్యానికి సంబంధించి మందులు తెచ్చుకునేందుకు పట్టణంలోకి వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగిరాలేదు. కుమారుడికి కోసం చెన్నారెడ్డి అన్ని ప్రాంతాల్లో వెదికాడు. కానీ ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు


దోర్నాల సమావేశంలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, జూన్ 18: అందరికీ అందుబాటులో ఉండి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. స్థానిక లహరి ఫంక్షన్ హాలులో దోర్నాల మండల కూటమి కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాలలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి తోడ్పడాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజా వ్యతిరేక పాలన చేసిన గత ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పార న్నారు. ఎన్నికల ముందు చెప్పిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చేందుకు రూపకల్పన చేస్తున్నారని జూలై నుంచి పెంచిన ఫించన్ల పంపిణీతో ముందడుగు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్ర బాబు, కర్రావుల రాజేంద్ర, బనేని నాగమల్లికార్జున, కొప్పుల సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, వెచ్చా హరగోపాల్, షేక్ భాష, ఇస్మాయిల్, బీజేపీ మండల అధ్యక్షులు వీరారెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం : పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలందరికీ అన్ని విషయాల్లోనూ ప్రాధాన్యం కల్పించి, న్యాయం చేస్తామని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్గాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తలు కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. గత మూడేళ్లుగా కనపడని కొత్త కొత్త నాయకులు ఇప్పుడు వస్తున్నారని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన నాయకులను బంధుత్వాల పేరుతో దగ్గరకు రానీయవద్దని టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. అవకాశవాద రాజకీయాల కోసం వెంట తిరిగే వారిని ఉపేక్షించవద్దన్నారు. త్రిపురాంతకం క్షేత్ర ప్రాధాన్యత నేపథ్యంలో రోడ్డు విస్తరణలో భాగంగా సాగర్ కాలువపై రెండో వంతెన నిర్మాణానికి, చెరువులో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోటకట్ల శ్రీనివాసరెడ్డి, డి.చలమయ్య, వి.ఆంజనేయులు, ఏ.నాసరరెడ్డి, కె.కొండలు, ఎం.వలరాజు, ఏ.సుబ్బారావు, జి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయ తాళాలు తెరిచేదెప్పుడో..?



నిరుపయోగంగా ఉన్న ఏఈ కార్యాలయం

పుల్లలచెరువు, జూన్ 18: పుల్లలచెరువు మండలంలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కనీసం తెరుచుకోవడం లేదు. ఆ కార్యాలయాల వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. అందుకు నిదర్శనమే పుల్లలచెరువు హౌసింగ్ కార్యాలయం. కొన్నేళ్లుగా హౌసింగ్ కార్యాలయ తాళాలు తెరుచుకోవడం లేదు. 2012లో అప్పటి ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కార్యాలయాన్ని నిర్మించింది. అప్పటి నుంచి 2018 వరకు ఈ కార్యాలయంలో అధికారులు అందుబాటులో వున్నారు. అ తరువాత ఎన్నికల కోడ్ రావడం, వైసీపీ ప్రభుత్వం రావడంతో ఈ కార్యాలయాన్ని హౌసింగ్ అధికారులు గాలికి వదిలేశారు. మండల ఏఈ కూడా ఇప్పటికి ఈ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో కార్యాలయం లోపల దుమ్ము దూళి చేరింది. మండల కార్యాలయంలో వుండాల్సిన అధికారులు సిబ్బంది ఎర్రగొండపాలెంలోని ప్రవేటు భవనాలకు అద్దెకు తీసుకొని అక్కడ నుంచి కార్యకలపాలు సాగిస్తున్నారు. దీంతో ఇంటి లబ్ధిదారులు పుల్లలచెరువు మండలం నుంచి ఎర్రగొండపాలేనికి ప్రదక్షణలు చేస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టి ప్రభుత్వ కార్యాలయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నారాయణరెడ్డికి ఘనసన్మానం

గునుపూడి ఆధ్వర్యంలో కేకు కట్ చేసిన కందుల


కేక్‌కట్ చేస్తున్న నారాయణరెడ్డి, గునుపూడి

పొదిలి, జూన్ 18 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్యవైశ్య నాయకుడు గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో పొదిలి ఆర్యవైశ్యులు కందుల నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం పొదిలి పట్టణం నుంచి గునుపూడి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆర్యవైశ్యులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీకేకును నారాయణరెడ్డి కట్‌చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ నా విజయానికి కృషి చేసిన ఆర్యవైశ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా నా వెన్నంటి ఉన్న గునుపూడితోపాటు ప్రతి కార్యకర్తకు, నాయకులకు న్యాయం చేస్తానని ఆయన చెప్పారు. ఎన్నికల సమయంలో గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య పరిచయ వేదిక కార్యక్రమంలో చెప్పిన హామీలకు కట్టుబడి పనులు చేస్తానని ఆయన చెప్పారు. అభినందించిన వారిలో గునుపూడి మధుసూదనరావ్, శ్రీదేవి, మాజీ ఉపర్పంచ్ జలాని, గోసంరక్షణ సమితి నాయకులు సత్యం పలువురు ఆర్యవైశ్యులు ఉన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం


కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

గిద్దలూరు టౌన్, జూన్ 18 : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించిన వివరాలను ఆర్‌బీకే సిబ్బంది టెలివిజన్ ద్వారా వీక్షించారు. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఒక్కొక్క విడతకు రూ.2వేలు చొప్పున 3 విడతల్లో మొత్తం 6వేలు రైతులకు పెట్టుబడి సాయం చేయడం జరిగిందని వవ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రైతు ఖాతాల్లో 16 విడతల పెట్టుబడి సాయం జమచేసినట్లు 17వ విడతకు సంబంధించి ప్రధానమంత్రి మోదీ వారణాసిలో రైతుల ఖాతాల్లోకి రూ.2వేలు జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించగా ఆకార్యక్రమాన్ని వ్యవసాయశాఖ కార్యాలయంలో అధికారులు, రైతులు, ఆర్‌బికె సిబ్బంది వీక్షించారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

పొదిలి, జూన్ 18 : బడి ఈడు పిల్లలను నూరుశాతం బడిలో చేర్పించాలని బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్‌వీఎస్ కుమార్ అన్నారు. మంగళవారం 'బడికి వెళదాం' కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక పెద్దబస్టాండ్ కూడలిలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి చదువుకు ఉన్న ప్రాధాన్యతను వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బడికి వెళదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు బడి మధ్యలోనేమానివేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంపై మళ్లీ ఆశలు

- నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభం
- గాలికి వదిలిన వైసీపీ, నేడు టీడీపీ రావడంతో ఆశలు

పెద్ద దోర్నాల, జూన్ 18: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు బీటీ రోడ్లను వైసీపీ గాలికి వదిలేసింది. ప్రస్తుతం మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయా రహదారుల అభివృద్ధిపై ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నుంచి అయినముక్కల, హసనాబాద్ గ్రామాలకు తారురోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అప్పట్లోనే పనులు ప్రారంభమయ్యాయి. అయితే నాడు ఎన్నికలు రావడం, వైసీపీ అధికారం చేపట్టడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లు గడిచినా ఆ పనులను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో సంబంధిత గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. వివరాల్లోకి వెళితే మండలంలోని అయినముక్కుల, హసనాబాద్ గ్రామాలు కేజీ రోడ్డుకు సుమారు కిలోమీటరు దూరంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు సక్రమంగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు ప్రజలు మరింత ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం కేజీ రోడ్డు నుంచి అయినముక్కుల గ్రామానికి ఏపీఆర్‌ఆర్‌పీ ద్వారా రూ.40.21లక్షలు నిధులు మంజూరు చేసింది. అప్పటి శాసనసభ్యులు పాలపర్తి డేవిడ్ రాజు 2019 జనవరి 9వ తేదీన శిలాఫలకం అవిష్కరించారు. పనులు కూడా ప్రారంభించారు. రోడ్డు చదును చేసి, గ్రావెల్‌తో ఒక లేయరు వేసి, మెటల్‌సైతం పరిచారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. పనులు నిలిచిపోయాయి.

కేజీ రోడ్డు నుండి 0.73 కిలోమీటర్ల దూరంలోని హసనాబాద్ గ్రామానికి తారు రోడ్డు నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ ఏపీఆర్‌ఆర్‌పీ ద్వారా రూ.75లక్షల నిధులను మంజూరు చేసింది. 2019 నవంబరు 19వ తేదీన పనులను ప్రారంభించా రు. ఏడాది లోపు పూర్తి చేసి ఐదేళ్లు నిర్వహణ చూసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. పనులు ప్రారంభించారు. చదును చేసి గ్రావెల్ తోలి మెటల్ వేశారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొంది. ఎన్నికలు రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేదు. చిన్న పాటి వాన కురిసినా ఆ రహదారుల్లో ప్రయాణించడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో రహదారి పనులు తిరిగి ప్రారంభం అవుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



అర్ధాంతరంగా నిలిచిన హసనాబాద్, అయినముక్కల రహదారులు

అవీ..ఇవీ..

ఆక్రమిత స్థలంలో పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కాపురం, జూన్ 18: మండలంలోని దరిమడుగు గ్రామంలోని సర్వే నెంబర్ 856లో ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. 'కాలువ కట్టి.. కనికట్టు చేసి..' అనే శీర్షికన ఈ నెల 17వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఆ శాఖ డీఈ, రమణయ్య, ఏఈ సందీప్‌లు స్థలం వద్దకు వెళ్లి అక్రమంగా సాగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అంతేకాక చుట్టుపక్కల ప్రాంతాలను, ఆర్‌అండ్‌బీ స్థలంలో ఇప్పటికే నిర్మితమైన మురుగు కాలువను గమనించారు. ఈ సందర్భంగా డీఈ రమణయ్య మాట్లాడుతూ ముందుగా 856 సర్వే నెంబర్‌లోని ఆర్‌అండ్‌బీ స్థలానికి బుధవారం కొలతలు వేయాలని మండల, సచివాలయ సర్వేయర్లకు లేఖలు పంపామన్నారు. కొలతలు వేసిన వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమ కట్టడాలను కూల్చివేసి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఫీజుల పట్టిక ఏర్పాటు చేయాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 18: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పట్టిక అమలు చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు సయ్యద్ జావిద్ అన్వర్ మంగళవారం ఒక ప్రకనటలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ పెరిగిందని అయినా విద్యాశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పట్టిక ఏర్పాటు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీలు అన్ని రంగాలలో రాణించాలి


మాట్లాడుతున్న పీవీ కృష్ణారావు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 18: బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ.. దేశంలో 52శాతం ఉన్న బీసీలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న పథకాలు, సహకారాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర సభ్యులు రాజా శ్రీకాంత్, నాయకులు వాసు, లక్ష్మీరెడ్డి, సుబ్బారావు, నాగార్జున, సురేశ్, నాగరాజు, పవన్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటం

- మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

గిద్దలూరు, జూన్ 18 : ప్రజాతీర్పును గౌరవిస్తున్నామని, తాము ఇక నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమే అన్నారు. ప్రజాతీర్పును స్వీకరిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, వైసీపీ నాయకులు బాదం గోపాల్, ముద్దర్ల శ్రీనివాసులు, నరసింహారెడ్డి, మానం బాలిరెడ్డి, ఓబులరావు, మస్తాన్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ ఉత్పత్తులను బహిష్కరించాలి



పాలస్తీనా స్వేచ్ఛ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐవో ప్రతినిధులు

గిద్దలూరు, జూన్ 18 : పాలస్తీనా భూభాగంపై ఐక్యరాజ్యసమితి ఆదేశాలను బేఖాతరు చేస్తూ దమనకాండను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తీరుకు నిరసనగా ఆ దేశ కంపెనీ ఉత్పత్తులను బహిష్కరించాలని ఎస్ఐవో సుప్రీమ్ కౌన్సిల్ కన్వీనర్ షేక్ ఖదీర్‌భాషా కోరారు. ఫ్రీ పాలస్తీన పోస్టర్లను ఆవిష్కరించారు. నైతిక విలువలను పెంపొందిస్తూ ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ఎస్ఐవో కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం చిన్నపిల్లలకు, విద్యార్థులకు, యువకులకు నైతిక విలువల శిక్షణపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐవో ప్రతినిధులు రోషన్ మొహిద్దీన్, రషీద్, నాయబ్‌రసూల్, హుస్సేన్, సుభాని పాల్గొన్నారు.

ఒంగోలు తాలూకా సీఐపై వేటు

- వీఆర్‌కు పిలిచిన ఉన్నతాధికారులు
- మెడికల్ లీవ్‌పై వెళ్లిన భక్తవత్సలరెడ్డి

ఒంగోలు క్రైం, జూన్ 18: ఒంగోలు తాలూకా సీఐగా పనిచేస్తున్న భక్తవత్సలరెడ్డిపై వేటు పడింది. పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు పిలిచారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు రేంజ్ కార్యాలయానికి పిలిచి వీఆర్‌కు వెళ్లాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. గత ఎన్నికల సందర్భంగా భక్తవత్సలరెడ్డి పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఒంగోలు నగరం సమతానగర్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడిచేసిన కేసులో ఏకపక్షంగా వ్యవహరించి బాధితులపై కేసులు నమోదు చేయడంపై టీడీపీ నాయకులు అప్పట్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదేవిధంగా వెంగముక్కలపాలెంలో ఎన్నికల రోజు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కోడలు కావ్యారెడ్డి పోలింగ్‌బూత్‌లో చొరబడి టీడీపీ కార్యకర్తలపై దాడిచేస్తే కేసులు నమోదు చేయలేదని అప్పట్లో ఎస్పీతో పాటూ ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అక్కడ టీడీపీలో ఉన్న దళిత కార్యకర్తలపై ఆమె దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఆ పార్టీ నాయకులు అప్పట్లోనే భక్తవత్సలరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు భక్తవత్సలరెడ్డిని వీఆర్‌కు పిలిచారు. అయితే మెడికల్ లీవ్‌లో వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.


మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కన్నులపండువగా మల్లికార్జున స్వామి వార్షికోత్సవం

ముండ్లమూరు, జూన్ 18: ముండ్లమూరులో వేంచేసి ఉన్న శ్రీమల్లమాంబ, మల్లికార్జున స్వామి ఆలయ రెండవ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తుల ఓం నమఃశివాయ నినాదాలతో ఆలయం మారుమ్రోగింది. తెల్లవారు జామునుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటు బంధువులు, సమీప గ్రామాల భక్తులు మల్లికార్జున స్వామిని, మల్లమాంబ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయం నిర్మించి రెండు సంవత్సరాలు కావటంతో భక్తులు పోటెత్తారు. వార్షికోత్సవం సందర్భం గా దేవతా మూర్తులను ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాయంత్రం దేవతా మూర్తులను గ్రామంలో ఊరేగించారు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని అభినందించిన వెంకన్నచౌదరి


టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును అభినందిస్తున్న వెంకన్నచౌదరి

దొనకొండ, జూన్ 18: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన గాజు వాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును మంగళవారం ఆపార్టీ దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ నేతృత్వంలో దొనకొండ మండల నాయకుడు వీరపనేని వెంకన్నచౌదరి పుష్పగుచ్ఛం అందజేసి అభినం దించారు. అభివృద్ధిలో ఎంతో వెనుకబడిన దర్శి నియోజకవర్గంలోని దొనకొండ ప్రాంతంలో ఒకటి రెండు పరిశ్రమలు ఏర్పాటుతోపాటు వెలిగొండ ప్రాజెక్టు నీళ్లు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేసినట్లు వెంకన్న తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు సింగమనేని హనుమంతరావు ఉన్నారు.

టీడీపీ ఫ్లెక్సీని చింపిన గుర్తుతెలియని వ్యక్తులు

కురిచేడు, జూన్ 18: మండలంలోని గంగదొనకొండలోని గంగాభవాని ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీ వారు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మితో కూడిన పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చింపి ఆలయంలో పడవేశారు. ఈవిషయమై గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉగ్రను సన్మానించిన టీడీపీ నాయకులు


ఉగ్రకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న పువ్వాడి కుటుంబసభ్యులు

పామూరు, జూన్ 18: సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కూటమి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని టీడీపీ పామూరు మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఉగ్రను అభినందిస్తూ శ్రీవేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. ఉగ్రను అభినందించినవారిలో మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, వెంకటలక్ష్మమ్మ, పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉన్నత పాఠశాలల్లో డ్రాయింగ్ పోస్టులు భర్తీచేయాలి

ముండ్లమూరు, జూన్ 18: ఉన్నత పాఠశాలల్లో డ్రాయింగ్, క్రాఫ్ట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిరుద్యోగ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు గోపనబోయిన ఏడుకొండలరావు కోరారు. ఈమేరకు మంగళవారం అమరావతిలో లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రెండు లక్షల మందికి పైగా శిక్షణ పొంది నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. సానుకూలంగా విన్న లోకేశ్ త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, జూన్ 18 : గుండ్లాపల్లి వద్ద గల 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతులను బుధవారం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మండలంలోని పలు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఎస్.వీరబ్రహ్మం తెలిపారు. మండలంలోని తాళ్లూరు, శివరాంపురం, మాధవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోనిగ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల

- ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఖాళీగా ఉన్న దర్శి తహసీల్దార్ కార్యాలయం

దర్శి, జూన్ 18: అధికారులు ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకున్న ట్లు కనిపించటం లేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి పది రోజులు అవుతున్నప్పటికీ కొంతమంది అధికారులు ఇంకా కార్యాలయాల మొఖం చూడ లేదు. వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు అధికారులు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటివ రకు అధికారులు అందుబాటులోకి రాలేదు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావటంతో వ్యవ సాయ రుణాలు తీసుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆన్‌లైన్ రికా ర్డులు తప్పనిసరిగా కావాల్సి ఉంది. ఈనేపథ్యంలో అధికారులు అందుబాటులో లేకపోవ టంతో ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

అలాగే, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మినహా మిగిలిన అధికశాతం మంది అధికారులు అందుబాటులో లేరు. ప్రభుత్వ పథకాల కోసం అర్థిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈనెలలో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదు. అధికారులు పట్టించుకోక పోవటంతో అరకొరగా పంపిణీచేసి 10వ తేదికి ముగించారు. అధికశాతం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావటంతో నాయకులు అధికారులను ప్రక్షాళన చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులను, వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారులను తక్షణమే పంపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

శరవేగంగా రైల్వే లైన్ పనులు

- సాకారంకానున్న కనిగిరి ప్రజల చిరకాల స్వప్నం
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


రైల్వేలైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జూన్ 18: ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కనిగిరి ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుందని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కలగట్ల గ్రామం వద్ద శరవేగంగా జరుగుతున్న నడికుడి - రైల్వేలైన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైల్వేమార్గం పనులు చురుకుగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైల్వే మార్గం నిర్మాణ పనులు మరింత వేగంగా జరిగే అవకాశముందన్నారు. కలగట్ల గ్రామ సమీపంలో జరుగుతున్న రైల్వే పనులు ప్రారంభదశలో ఉన్న ఈతరుణంలో కనిగిరి ప్రాంత ప్రజలకు అనుగుణంగా మార్పులు, చేర్పుల విషయంపై అవగాహన కోసం పనులు పరిశీలించినట్లు తెలిపారు. నిర్మాణంలో చిన్నచిన్న లోపాలను కూడా సరిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైల్వేలైన్ నిర్మాణ జరిగి రైల్వేస్టేషన్ ఏర్పడితే కనిగిరి ప్రజలకు రవాణా సౌకర్యం ఎంతో మెరుగుపడుతుంన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, జంషీర్, గుడిపాటి ఖాదర్, తమ్మినేని శ్రీను, సిద్ధాంతి బారాయిమాం, సైకం మాలకొండారెడ్డి, షరీఫ్, కేవీఎస్ గౌడ్, ఐవీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాగు ఆక్రమణలను తొలగిస్తాం

- ఆర్డీవో జాన్‌ఇర్విన్


కనిగిరి చెక్‌పోస్టు వద్ద వాగు ఆక్రమణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కనిగిరి, జూన్ 18: కనిగిరి ప్రాంతంలో కొండవాగు, చెరువు అలుగు వాగులను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు ఆక్ర మణలను తొలగిస్తామని ఆర్డీవో జాన్‌ఇర్విన్ అన్నారు. కనిగిరి పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద ఉన్న భారీ వాగును, కంభం రోడ్డులోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈక్రమంలో మంగళవారం ఆంధ్రజ్యోతిలో కనిగిరిలో ఆగని అకమాలు శీర్షికన ప్రచురితమైన కథనంపై అధి కారులు స్పందించారు. ఆర్డీవో జాన్‌ఇర్విన్ వాగు ఆక్రమణల ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరిలోని పెద్దచెరువు, నాగులచెరువు అలుగువాగులను, కొండవాగులను పూర్వపు రికార్డులను పరిశీలించి ఆక్రమణలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందులోభాగంగా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారులతో బృందం గా ఏర్పాటుచేసినట్టు చెప్పారు. వారంలోగా కనిగిరి ప్రాంతంలోని వాగులు, వంకలు, కొండ సాలువాగుల విస్తీర్ణాన్ని సర్వే అధికా రులు తేల్చనున్నట్లు తెలిపారు. అనంతరం సర్వే రిపోర్టు ఆధారంగా వాగుల విస్తీర్ణం ప్రకారం ఆక్రమణలను తొలగించనున్నట్లు తెలిపారు. కనిగిరి పెద్ద చెరువు, నాగులచెరువు ఫీడర్ కెనాల్స్, స్టోరేజీ కెనాల్స్‌ను గుర్తించి ఆక్రమ ణలు ఉంటే తొలగిస్తామని చెప్పారు.

వాగులు, వంకలు, ప్రభుత్వ పో రంబోకు, అసైన్‌మెంట్ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీచేస్తామని ఆర్డీవో పేర్కొన్నారు.. ఎంత టి నిర్మాణాలు ఉన్నా ఉపేక్షించకుండా వాటిని కూల్చివేసిందుకు కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కనిగిరి చెక్ పోస్టు వద్ద ఉన్న వాగుచప్టా వెంబడి ఉన్న వాగు సాలు విస్తీర్ణాన్ని, సమీ పంలో ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేపట్టనున్నట్టు చెప్పారు. సంబం ధిత ఆక్రమణదారుడికి నోటీసులు జారీ చేసి నిర్ణీత గడువులోగా వాటిని తొలగించకపోతే తామే స్వయంగా తీసివేయిస్తామన్నారు. మున్సిపాల్టీలోని ఆయా స్థలాలు, మున్సిపాల్టీకి అప్పగించిన దాతల స్థలాలు, బావి స్థలాల ను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఆయ న వెంట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

త్వరలో అన్న క్యాంటీన్ భవనాన్ని ప్రారంభిస్తాం


అన్న క్యాంటీన్ భవనం ప్రారంభించే విషయంపై అధికారులతో చర్చిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 18: త్వరలో అన్న క్యాంటీన్ భవనాన్ని ప్రారంభిస్తామని టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చెప్పారు. దర్శి-కురిచేడు రోడ్డులో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన అన్న క్యాంటీన్ భవనాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అంతకుముందు భవనం చుట్టూ దట్టంగా పెరిగిన చిల్లచెట్లను ఆమె ఆదేశాల మేరకు తొలగించి చదు ను చేశారు. భవనాన్ని పునర్నిర్మాణం చేసేందుకు ఆప్రాంతాన్ని లక్ష్మి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించ కుండా వైసీపీ పాలకులు మధ్యలో వదిలేశారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా పునరుద్ధరిస్తున్నట్టు చెప్పారు. అం దులోభాగంగా దర్శిలో మధ్యలో నిలిచిన భవనాన్ని వేగవంతంగా పూర్తిచేసి త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, దారం సుబ్బారావు, వీరపనేని రంగా, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలశీతలీకరణ కేంద్రాన్ని పునరుద్ధరించాలి

- పాడి రైతుల వినతి


డిప్యూటీ తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పాడిరైతులు

తాళ్లూరు, జూన్ 18: ఒంగోలులోని పాల శీతలీకరణ కేంద్రాన్ని పునరుద్ధరించి ఆదుకోవాలని పాడి రైతులు కోరారు. ఈమేరకు మంగళవారం ఎంపీడీవో, తహసీల్దార్, పశువైద్యశాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాళ్లూరు ప్రాంతంలో అధిక సంఖ్యలో పాడి పరిశ్రమనే జీవనాధారం చేసుకుని జీవిస్తున్నారన్నారు. ప్రయివేట్ డెయిరీల యజమానులు ఇష్టానుసారంగా పాల ధరలను తగ్గిస్తూ, పెంచుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఒక్కోసారి తమకు పాలు వద్దని నిరాకరించి పాలుతీసుకోక పోవటంతో నష్టపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఒంగోలు పాల శీతలీకరణ కేంద్రంలో అత్యధిక పాలు నిల్వ వుంచే సామర్థ్యం, అత్యధికంగా పాలపొడి తయారు చేయదగ్గ సామర్థ్యం ఉందన్నారు. డెయిరీని పునరుద్ధరించి ఆదుకోవాలని పాడి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాలను డిప్యూటీ తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజు, పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం ఏవో శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ వినతిపత్రాలను జిల్లా యంత్రాగానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 200 మంది పాడి రైతులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

పీసీపల్లి, జూన్ 18: ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను మండల విద్యాశాఖ అధికారులు ఆర్.శ్రీనివాసులు, సంజీవిలు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, నోట్‌బుక్‌లను ఇటీవల సరఫరా చేసింది. వాటిని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యా యుల ద్వారా అందించేందుకు ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలకు పంపించారు. ఈసందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవోలు శ్రీనివాసులు, సంజీవిలు మాట్లాడుతూ ఎటువంటి కొరత లేకుండా విద్యార్థులకు సరిపడా పుస్తకాలు, నోట్‌బుక్‌లను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు.

పామూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా స్టూడెంట్ కట్లను పంపిణీ చేస్తున్నట్లు ఎంఈవో -1 రామసుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు నోటు, పాఠ్య పుస్తాకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎం.రామస్వామి, సయ్యద్ ఈసాక్ పాల్గొన్నారు.


ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవంలో పూజలు చేస్తున్న లక్ష్మి

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ వార్షికోత్సవం

కురిచేడు, జూన్ 18: మండలంలోని పడమర గంగవరంలో నిర్మించిన 30 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం 7వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వారికి ఆకుపూజ నిర్వహించారు. విగ్రహ కమిటీ వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కమతం నాగిరెడ్డి, దాసరి ఏడుకొండలు, గడ్డం బాలయ్య, కాట్రాజు నాగరాజు, పిడతల నెమిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

పామూరు, జూన్ 18: మండలంలోని చిలంకూరులో గల శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం గ్రామోత్సవం, వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో స్వామివార్లకు అర్చన, మంగళహారతి నిర్వహించి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే, మండలంలోని నర్రమారెళ్ల పంచాయతిలో వెలసియున్న గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్లను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి శాంతి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పామూరు, జూన్ 18: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తున్నట్లు ఏవో కె.రాధ తెలి పారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో పామూరు, సీఎస్ పురం మండలాల్లోని రైతులు పచ్చిరొట్ట విత్తనాల కోసం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మినుము, జీలుగ, పిల్లిపెసరలు ఇస్తున్నట్టు తెలిపారు.

PUBLIC NOTICE

Under instructions of my client **Thommandula Pramila** now Residing at Pamuru Post and Mandal, Prakasam District, Andhra Pradesh. Given the following facts to all public.

Notice is hereby given that the documents bearing Original Sale Deed dated executed between **(THOMMANDULA KUMARA SWAMY) (BUYER)** and **(R. MANGALRAJ & S.VASUDEVAN represented by M/s Surya Finance & Investments Managing Director K.L.V.RAMA RAO)**, registered Sale Deed 23.12.1985 and registered as Document No 3437/1985 in the Office of the sub Registrar Adyar has been misplaced and not traceable yet. The report of the same has been lodged at the PAMMUR (ANDHRA PRADESH) Police Station on 13.05.2021 VIDE Acknowledgement Report No AP20 76766621.

If found, kindly inform to THOMMANDULA PRAMEELA (ADHAAR NO. 7232 3681 8360), Wife of Late Mr.T.Kumarasami, residing at No.165, Pamur, Prakasam District, Andhra Pradesh, 523103, Mobile no.9246581272

Description of lost/misplaced original documents All that piece and parcel of vacant land Plot Nos. 13, land being Punjai in Survey No 281/3 measuring 4.5 cents in Injambakkam Village, formerly Saidapet Taluk, Chenglepattu District, Now Sholinganallur Taluk, Chennai District and measuring an extent of 1800 Sq.ft. Within the State of Tamilnadu.

Dt: 18-06-2024
Place : Markapur

Nama Subbarao, M.A, BL,
Advocate,
Markapur, Prakasam District
Cell: **9441067352.**

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
రీజనల్ ఆఫీస్, ఒంగోలు

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది పేర్కొనబడిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టుపెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినను వారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణము చెల్లించవలసిన కాలము గడిచినందున సదరు బంగారు నగలు **ది.29-06-2024 శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, మార్కెట్ సెంటర్ బ్రాంచి, భాగ్యనగర్, ఒంగోలు** ఆవరణలో బహిరంగ వేలము వేసి వారి పేరునయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచిన వారు **ది. 29-06-2024 శనివారం మధ్యాహ్నం 2.00 గంటలలోపు రూ.20,000/-లు** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టి కారణము చూపకనే వేలము రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా, బకాయిలు రద్దుకాని ఎడల వారిపై చట్టరీత్యా తగుచర్యలు తీసుకొని మిగిలిన బకాయిలను వసూలు చేయబడును. మరియు వేలము తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల ఈ ప్రకటన వారి వారసులకు వర్తించును. బ్యాంకు నుండి వారి వారి ఖాతాదారులకు ఋణము చెల్లించవలసినదిగా కోరుతూ పంపినటువంటి నోటీసులు ఏ కారణము చేతనైన ఖాతాదారులకు చేరకపోయిన ఖాతాదారులు తీసుకొనకపోయిన, ఖాతాదారులు మరణించియున్న ఈ పత్రిక నోటీసును తుది నోటీసుగా భావించవలసినదిగా కోరుచున్నాము. మునుపటి నోటీసులు చేరని విషయములో ఎటువంటి ఉత్తరప్రత్యుత్తరాలకు బ్యాంకు బాధ్యత వహించదు.

వ.సెం	BIC	ఖాతా నెంబరు	శాఖ	ఖాతాదారుని పేరు	గ్రామం	తూకం గ్రా.
1	5201	91152038954	చినగంజాం	లక్ష్మీపతిరెడ్డి దోమ, తండ్రి పోతురాజురెడ్డి	ములగానివారిపాలెం	60.4
2	5201	91152035895	చినగంజాం	లక్ష్మీపతిరెడ్డి దోమ, తండ్రి పోతురాజురెడ్డి	ములగానివారిపాలెం	60.7
3	5092	91160006954	ఒంగోలు మార్కెట్ సెంటర్	దొడ్ల సత్యనారాయణరెడ్డి, తండ్రి రంగారెడ్డి	బాలాజీనగర్	25.6
4	5092	91177497536	ఒంగోలు మార్కెట్ సెంటర్	దొడ్ల సత్యనారాయణరెడ్డి, తండ్రి రంగారెడ్డి	బాలాజీనగర్	9.8
5	5211	91132919573	పెద్దారు	కోలా మాధవి, భర్త రోశయ్య	ధర్మవరం	20.4
6	5216	91145454420	ఆల్లూరు	కావల మోషే(లేట్), తండ్రి రామయ్య కావల	అంబేద్కర్‌నగర్	30
7	5197	91166907909	వలపర్ల	రామక్రిష్ణ మిన్నెకంటి, తండ్రి మోహన్‌రావు	రామకూరు	73.3
8	5197	91180503088	వలపర్ల	రామక్రిష్ణ మిన్నెకంటి, తండ్రి మోహన్‌రావు	రామకూరు	23.6

తేది : 18-06-2024
ఒంగోలు

సం/- **రీజనల్ మేనేజర్,** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, రీజనల్ ఆఫీస్, ఒంగోలు,



- విత్తనాల ధరలకు రెక్కలు
- అన్నదాతలపై ఆర్థిక భారం
- సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- ధరల నియంత్రణను పట్టించుకోని అధికారులు

కొనాలంటే.. కష్టం

విత్తు నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. విత్తనాల నుంచి రైతులపై ఆర్థిక భారం పడుతోంది. విత్తనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అడపాదడపా వర్షాలతో పొలాలు దున్నిన రైతులు విత్తనాల కోసం ఎగబడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు ధరలను పెంచేశారు. విత్తన కంపెనీలు రకరకాల మాయలతో మార్కెట్‌ను ముంచెత్తుతుండగా.. రైతులు దోపిడీకి గురవుతున్నారు. విత్తనాలు, వాటి ధరలకు సంబంధించి అధికారుల నియంత్రణ కొరవడింది. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విత్తనాల విక్రయాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరలకు, వ్యాపారులు వసూలు చేసే ధరకు పొంతన ఉండటంలేదు. వ్యవసాయ శాఖ చెప్పినట్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా విత్తన విక్రయాలు జరగడంలేదు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారే కానీ రైతుల దోపిడీకి సంబంధించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదు. దీంతో వ్యాపారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు.

నరసరావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిసి పదునైన పొలాల్లో రైతులు సేద్యం మొదలుపెట్టారు. వివిధ రకాలకు సంబంధించిన విత్తనాల ధరలు మండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. రైతులు ఆసక్తి చూపుతున్న విత్తనాల ధరలను విత్తన సంస్థలు పెంచేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ధరలకు కొన్ని రకాల విత్తనాలు మార్కెట్లో లభించడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ధరలు పెంచి కొన్ని కంపెనీలు, వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి, డెల్టాలో వరి సాగు ప్రారంభమైంది.



ఆటోలో విత్తనాలు తీసుకు వెళ్తున్న రైతులు

అయితే ఆయా పంటలకు సంబంధించిన విత్తనాల కొనుగోలు రైతులకు తలనొప్పిగా మారింది. పల్నాడు జిల్లాలో 3,06,250 ఎకరాల్లో పత్తి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందే కానీ ధరలకు సంబంధించి కనీస చర్యలు కూడా తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఇక కొన్ని రకాల మిర్చి విత్తనాల ధర కిలో రూ.1.20 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకు పలుకుతోంది. మిర్చి ధర బాగుంది. దీంతో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా మిర్చి సాగు వైపు మొగ్గు చూపుతారని అంచనా. దీనిని విత్తన కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇప్పటికే రైతులు పొలాలను కౌలుకు తీసుకుంటూ.. విత్తనాల కొనుగోలుపైనా దృష్టి పెట్టారు. నల్ల తామర, వైరస్‌ను తట్టుకుంటున్నాయనే ప్రచారంతో కొన్ని రకాలపైనే రైతులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆయా కంపెనీల విత్తనాల ధరలు చుక్కలంటుతున్నాయి. ఆరుమూరు, తేజ రకాల విత్తనాలను కొన్ని కంపెనీలు కిలో రూ.లక్షన్నర వరకు విక్రయిస్తున్నట్లు రైతులు చెప్పారు. మరికొన్ని రకాల విత్తనాలు కిలో లక్ష నుంచి 1.10 లక్షల వరకు ఉన్నాయంటున్నారు. అధిక ధరలకు విత్తనాల విక్రయాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అధిక ధరలకు విక్రయిస్తున్న విత్తనాలకు, తక్కువ ధరకు లభిస్తున్న విత్తనాలకు ఉన్న తేడాను రైతులకు వివరించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖలు కృషి చేయాలి. ఏ రకం విత్తనం వల్ల వచ్చే దిగుబడులు, ఆశించే తెగుళ్ల విషయంలో రైతులకు అవగాహన కల్పిస్తే ఎక్కువ ధరలకు విత్తనాలకు కొనుగోలు చేసి రైతులు నష్టపోకుండా అరికట్టే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ ధర రూ.864.. వసూలు రూ.1300

పత్తి విత్తనం ప్యాకెట్ ధర రూ.864గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ ధరకు కొన్ని రకాలే మార్కెట్లో లభిస్తున్నాయి. మరి కొన్ని రకాల ధరలను వ్యాపారులు విపరీతంగా పెంచేశారు. యూఎస్ 7067 రకం పత్తి విత్తనాల కొనుగోలుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ రకం విత్తనాలను మార్కెట్లో ప్యాకెట్ రూ.1300 వరకు విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు. ఏషియన్ సంస్థకు సంబంధించిన మరో రకం విత్తనం ప్యాకెట్ రూ.1200 వరకు విక్రయిస్తున్నారని రైతులు చెప్పారు. ఈ రెండు రకాల విత్తనాలపై రైతులు ఆసక్తి కనబరుస్తుండటంతో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



- పవన్‌కల్యాణ్‌కు రాజధాని పల్లెల్లో ఘన స్వాగతం
- సీడ్ రోడ్డుపై ఆరు కిలోమీటర్లు పూలు పరిచిన రైతులు
- ఉపముఖ్యమంత్రికి గజమాలలతో సత్కారాలు.. పూలాభిషేకాలు

అడుగడుగునా.. అభిమానం



తుళ్లూరు, జూన్ 18: గత ప్రభుత్వ హయాంలో ముళ్ల కంచెలను దాటుకుని, పోలీసు నిర్బంధాలను ఛేదించుకుని వచ్చి తమకు సంఘీభావం తెలిపిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై అమరావతి రైతులు, మహిళలు అభిమానం చాటుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మంగళవారం సచివాలయ సందర్శనకు వస్తున్నట్లు రైతులకు తెలిసింది. దీంతో మండుటెండలో రోడ్డుకు ఇరువైపులా రైతులు, మహిళలతో పాటు చిన్నారులు, వృద్ధులు, యువత పెద్దసంఖ్యలో ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. సీడ్ రోడ్డుపై ఆరు కిలో మీటర్లు పూల పాన్పు వేసి మరీ అభిమాన నేతను స్వాగతించారు. మధ్యాహ్నం రెండు గంటలకు సీడ్ రోడ్డుపైకి చేరిన రాజధాని గ్రామాల రైతులు, మహిళలు పవన్‌కల్యాణ్ కోసం ఎదురు చూశారు. ఆయన మూడున్నర గంటలకు వెంకటపాలెం సీడ్ రోడ్డులోకి ప్రవేశించగా గజమాలలతో రైతులు సత్కరించారు. మహిళలు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. రాజధాని ఆందోళనల్లో అండగా నిలిచిన నేతపై పూల వర్షం కురిపించారు. తాళ్లాయపాలెం జంక్షన్‌లో న్యాయదేవత విగ్రహం ఉంచి న్యాయం గెలిచింది.. అన్యాయం ఓడింది.. అమరావతి నిలబడింది.. అంటూ పవన్‌కల్యాణ్ కాన్వాయ్ వచ్చే సమయం లో రైతులు, రైతు కూలీలు, మహిళలు నినాదాలు చేశారు. పవన్ కల్యాణ్ ఓపెన్ టాప్ కారులో నుంచే న్యాయదేవత విగ్రహానికి పూలు చల్లి దండం పెట్టారు. మార్గమధ్యలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు స్వాగతం సుస్వాగతం.. అంటూ ఫ్లెక్సీలతో చిన్నారులు, మహిళలు సందడి చేశారు. వెంకటపాలెం సీడ్ రోడ్డు నుంచి మందడం మీదగా వెలగపూడి సచివాలయానికి పవన్ కల్యాణ్ వెళ్లారు.




పవన్‌కల్యాణ్‌కు ఘన స్వాగతం పలుకుతున్న రైతులు

పోస్టింగ్‌లు.. పైరవీలు



పోస్టింగ్‌ల కోసం అధికారులు.. ఉద్యోగులు పాట్లు పడుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద క్యూ కడుతున్నారు. కోరుకున్న సీటు కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారు. కొందరైతే ఫలానా సీటు తనదేనంటూ కర్చీఫ్ వేసుకుంటున్నారు. కాగా.. వైసీపీతో అంటకాగిన అధికారుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ ఎమ్మెల్యే చెప్పినదాని కల్లా తలూపిన అధికారులకు ఇక గడ్డుకాలమేనన్న ప్రచారం. తెలుగుదేశం పార్టీ ముద్ర వేసి లూప్‌లైన్‌లో ఉంచిన అధికారులకు మంచి రోజులు రానున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశాలున్నాయి.



- ఎమ్మెల్యేల ఇళ్లకు క్యూ కడుతున్న అధికారులు.. ఉద్యోగులు
- కోరుకున్న పోస్టు కోసం లాబీయింగ్
- సీట్లపై కర్చీఫ్ వేసుకుంటున్న వైనం
- వైసీపీతో అంటకాగిన వారిలో ఆందోళన
- నాడు దూరంగా ఉంచిన అధికారులకు ప్రాధాన్యం

నరసరావుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. మంత్రుల నియామకం పూర్తైంది. త్వరలో బదిలీల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికార వర్గాలు అంచనాకు వచ్చాయి. సమయం సమీపిస్తుండటంతో ముందుగానే ఎమ్మెల్యేలను కలసి ఫలానా పోస్టు తనకు కావాలని కొందరు అధికారులు.. ఉద్యోగులు ఇప్పటికే కోరారు. మునిసిపాల్టీలు, పంచాయతీ రాజ్, పోలీసు, రెవెన్యూ శాఖల్లో పోస్టింగ్‌ల కోసం పోటీ అధికంగా ఉంది. ఇది కొందరు ఎమ్మెల్యేలకు తలనొప్పిగా పరిణమిస్తున్నట్లు వారి అనుచరులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో చాలామంది అధికారులను లూప్‌లైన్ పెట్టారు. వీరందరిపై తెలుగుదేశం పార్టీ ముద్ర వేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఇందుకోసం అప్పట్లో వైసీపీలో కొందరు అధికారులు చక్రం తిప్పారు. వారికి నచ్చని అధికారులు, ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయించడంతో పాటు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు.

ఉల్లంఘనులపై నజర్..

పోలీసు శాఖలో వైసీపీ ఎమ్మెల్యేలతో కొందరు అధికారులు అంటకాగి తెలుగుదేశం పార్టీ, జనసేన శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు పోలీసు స్టేషన్‌లకు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేశారు. ఇలాంటి అధికారుల పేర్లను లోకేశ్ తన రెడ్ బుక్‌లో కూడా నమోదు చేశారు. కొందరు అధికారులు వారి తోటి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశారు. కొందరికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా హింసించారు. పోలీసు శాఖలో ఇలాంటి అధికారుల జాబితాలను అధికార పార్టీ వర్గాలు సిద్ధం చేసి ఎమ్మెల్యేలకు అందజేసినట్లు చెబుతున్నారు. రెవెన్యూశాఖలో కూడా ఒక వర్గం అధికారులపై కక్ష సాధింపుకు పాల్పడింది. పంచాయతీరాజ్‌లో ఉపాధి హామీ పథకం పనులు చేయించిన టీడీపీ మద్దతు దారులైన కాంట్రాక్టర్లకు బిల్లులు రాకుండా చేశారు. ఉదాహరణకు నాడు డ్వామా పీడీగా చేసి నేడు పుడా వైస్ చైర్మన్‌గా పనిచేస్తున్న జి.శ్రీనివాసరెడ్డి కోట్లాది రూపాయల విలువైన పనుల బిల్లులు రాకుండా చేశారు. ప్రగతి పనులు చేసినా చేయనట్లుగా ప్రభుత్వానికి నివేదికలు పంపి కాంట్రాక్టర్లను కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. ఎం - బుక్‌లను కూడా దాచేశారు. ఈ అధికారిపై తిరుగుబాటు చేయడంతో ఎం- బుక్‌లను ఇచ్చేవిధంగా అంగీకరించారు. ఇలాంటి అధికారులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. వీరందరిపై చర్యలు తీసుకోవాలని, వీరికి ఎక్కడా పోస్టింగ్‌లు లేకుండా లూప్‌లైన్ ఉంచాలని ఎమ్మెల్యేలపై టీడీపీ శ్రేణులు ఒత్తిడి తెస్తున్నాయి. టీడీపీ కాంట్రాక్టర్లు చేసిన పనులకు దొడ్డిదారిన వైసీపీ వ్యక్తులు చేసినట్టుగా సృష్టించి వారికి బిల్లులు చెల్లించిన ఘనులు ఉన్నారు. నరసరావుపేటలో పంచాయతీ రాజ్‌లో ఒక ఏఈ ఈవిధంగా చేసి అడ్డంగా దొరికిపోయాడు. సదరు అధికారి రూ.10 లక్షలు తిరిగి చెల్లించే విధంగా ఒప్పందం జరిగింది. ఇలా కొందరు అధికారులు వైసీపీ నేతలు చెప్పిన పని చేసి నేడు ఇరకాటంలో పడ్డారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమాలో అక్రమాలకు పాల్పడిన అధికారులు టీడీపీ అధికారంలోకి రావడంతో వారికి ముచ్చెమటలు పడుతున్నాయి.

అక్రమార్కుల్లో కలవరం..

రెవెన్యూ శాఖలో భూముల అక్రమాలు యథేచ్ఛగా జరిగాయి. ప్రభుత్వ భూములను వైసీపీ నేతలకు దారాదత్తం చేశారు. ఈ అవినీతి తిమింగలాల చిట్టాను టీడీపీ శ్రేణులు సాక్షాధారాలతో సహా బయట పెడుతుండటంతో అక్రమార్కులు కలవరం చెందుతున్నారు. టీడీపీ ముద్ర వేసి పలు శాఖలో కొందరు అధికారులను, ఉద్యోగులను వైసీపీ ఎమ్మెల్యేలు తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. సదరు ఎమ్మెల్యేల అండదండలతో రెచ్చిపోయిన అధికారులకు సీన్ రివర్స్ కానుందన్న ప్రచారం జరుగుతోంది. ఐదేళ్లుగా పోలీసు శాఖలో లూప్‌లైన్‌లో ఉంచి ఇబ్బందులకు గురిచేసిన అధికారులు, కూటమి అధికారంలోకి రావడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. కాగా వైసీపీలో పెత్తనం చేసిన అధికారుల కూడా కూటమి ఎమ్మెల్యేలను కలిసి బొకేలు అందజేస్తూ అభినందలు తెలియజేసి వారి వద్ద మార్కులు వేయించేకునే పనిలో ఉన్నారు. దీనిని వైసీపీ బాధిత అధికారుల జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యేల అనుచరులు, బంధువులు, కుటుంబ సభ్యుల ద్వారా పోస్టింగ్‌ల కోసం పూర్తిస్థాయిలో పైరవీలు చేసుకుంటున్నారు. ఫలానా పోస్టు తనదేనన్న ధీమాను కూడా కొందరు అధికారులు వ్యక్తం చేస్తుండటం వారికి ఎమ్మెల్యేతో ఉన్న లాబీయింగ్ తెలియజేస్తుంది. వైసీపీతో అంటకాగిన వారికి కూడా మంచి పోస్టులు లభించే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అధికారుల హడావుడి..

ఇంకా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయలేదు. వారు లెటర్‌ప్యాడ్ కూడా ముద్రించలేదు. అప్పటి వరకు ఆగలేని అధికారులు ఎమ్మెల్యేలను కలసి వారికి అనుకూలంగా ఉన్న పోస్టింగ్ కోసం మాట తీసుకుంటున్నారు. వైసీపీతో అంటకాగిన అధికారులకు కూడా పోస్టింగ్‌లలో ప్రాధాన్యం లభిస్తుందన్న ప్రచారం ఉంది. టీడీపీ ముద్ర పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న అధికారులు.. ఉద్యోగులకు న్యాయం చేస్తారా లేదా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు విడుదల చేయక ముందే ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద అధికారుల హడావుడి కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు అధికారులు వారికి నచ్చిన పోస్టింగ్ హామీ కూడా లభించిందన్న ప్రచారం చేసుకుంటున్నారు. జీరో సీనియార్టీపై బదిలీలు ఉంటాయన్న ప్రచారం. దీంతో అన్ని శాఖల్లో బదిలీలు భారీగానే జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేడు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం

- ముస్తాబైన బాపట్ల వ్యవసాయ కళాశాల..
- హాజరు కానున్న గవర్నర్

బాపట్ల, జూన్ 18: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి బాపట్ల వ్యవసాయ కళాశాల ముస్తాబైంది. 75 సంవత్సరాల చరిత్ర కలిగిన బాపట్ల వ్యవసాయ కళాశాలలో గత కొన్నేళ్లుగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది కూడా బుధవారం 56వ స్నాతకోత్సవం నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షతన స్నాతకోత్సవం జరగనున్నది. కళాశాలలోని డాక్టర్ బివి.నాథ్ ఆడిటోరియంతోపాటు 2016లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్నాతకోత్సవానికి విచ్చేసిన సందర్భంలో శంకుస్థాపన చేసి నిర్మించిన భవనం, కళాశాల ప్రధాన భవనాన్ని వేడుకలకు ముస్తాబు చేశారు. వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రాలను వైస్‌చాన్స్‌లర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 11.30 గంటలకు వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ చాన్స్‌లర్, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తోపాటు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ వేడుకల్లో పట్టభద్రులైన 1000 మంది విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, అవార్డులను పంపిణీ చేస్తామన్నారు. 17 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్‌కు, నలుగురు అండర్ గ్రాడ్యుయేట్‌లకు బంగారు పతకాలు ఇస్తామన్నారు. యూనివర్సిటీలో బోధన, పరిశోధన, విస్తరణ విభాగాలలో పనిచేస్తున్న 10 మంది అధ్యాపకులకు కూడా అవార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, వర్సిటీ విభాగాధిపతులు డాక్టర్ ఎ.మణి, డాక్టర్ రమణ, డాక్టర్ జి.రామచంద్రరావు, డాక్టర్ పి.శ్రీలక్ష్మి, ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.ఏడుకొండలు, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్, డాక్టర్ అనీల్ తదితరులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవానికి ముస్తాబైన బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డాక్టర్ బీవీ నాథ్ ఆడిటోరియం

సింథైట్ కారం ఫ్యాక్టరీని మూసేయండి

ఆందోళనకు దిగిన మేదరమెట్ల గ్రామస్థులు

కోరు, ధూళితో ఇబ్బందిపడుతున్న వైనం



ఫ్యాక్టరీ నుంచి ఉద్యోగులను బయటకు పంపుతున్న గ్రామస్థులు

మేదరమెట్ల, జూన్ 18 : ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సింథైట్ కారం ఫ్యాక్టరీని మూసివేయాలని మేదరమెట్ల గ్రామస్థులు పట్టుబట్టారు. మంగళవారం గ్రామస్థులంతా ఫ్యాక్టరీలోకి వెళ్లి ఆందోళన చేపట్టారు. ప్రతి సంవత్సరం వేసవికాలంలో సింథైట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కోరును భరించలేక మేదరమెట్ల గ్రామస్థులు అల్లాడుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే కోరు పొగ, ధూళితో ముక్కులు, పెదాలు మంటలతో పాటు శ్వాశ పీల్చడంలో కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారం ఫ్యాక్టరీపై ఏటా గ్రామస్థులు ఫిర్యాదులు చేస్తున్నా యాజమాన్యం విస్తరణకు వెళ్లడం జరిగింది. పొల్యూషన్ కంట్రోలు బోర్డు మొదట అనుమతులు ఇవ్వడానికి నిరాకరించినా ఒత్తిళ్లతో ఏడాదివరకు అదనంగా ఉత్పత్తిని పెంచుకునే వెసులుబాటును కల్పించింది. గ్రామస్థులు పలు మార్లు పొల్యూషన్ కంట్రోలు బోర్డుకు ఫిర్యాదు చేయగా బోర్డు ఉన్నతాధికారులు పరిశ్రమను పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులపట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఫ్యాక్టరీ బాయిలర్‌లో మిరపకాయల తొడిమలను పొడిచేసి బాయిలర్లో వాడుతున్నారు. దీనివలన కోరు విపరీతంగా వస్తున్నది. దీంతో పాటు పరిశ్రమలో ఎప్పటికప్పుడు శుభ్రం చేయక పోవడం వలన అక్కడ ఉన్న కారం గాలిలో కలవడంతో కోరు విపరీతంగా వస్తున్నది. మంగళవారం గ్రామస్థులు ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి బాయిలర్‌లోకి వెళ్లి చూడగా మిరపకాయల తొడిమల పొడిని బాయిలర్‌లో వాడడం కనిపించింది. యాజమాన్యం చాలాసార్లు వరిపొట్టు వాడుతామని, మిరప కాయల తొడిమలను వినియోగించడం లేదని హామీ ఇచ్చింది. ఆ హామీలను తుంగలోతొక్కి వాతావరణాన్ని కలుషితం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ అధికారులు గ్రామస్థులతో చర్చించి రెండు రోజులపాటు ఫ్యాక్టరీని మూసివేసి కోరు రాకుండా, ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చీరాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి

సీఎం చంద్రబాబును కోరిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 18 : చీరాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కోరినట్లు తెలిసింది. చీరాల నియోజకవర్గ పరిస్థితి బాగలేదని, వ్యవస్థలు దారుణంగా ఉన్నాయని, సాగునీటి వనరులు అధ్వానంతోపాటు అనేక సమస్యలు ఉన్నట్లు ఎమ్మెల్యే కొండయ్య సీఎం దృష్టికి తీసుకెళ్లారు. చీరాల నియోజకవర్గంకు చెందిన పలువురు నాయకులతో మంగళవారం అమరావతిలో సీఎం కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా నియెజకర్గ వర్తమాన, భవిష్యత్ ప్రణాళికను క్లుప్తంగా వివరించనట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల తరువాత పూర్తి స్థాయిలో సమస్యల పరిష్కారంపై చర్చించి తగిన చర్యలు తీసుకుందామని సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే కొండయ్యకు చెప్పినట్లు సమాచారం. అనంతరం తనతో పాటు వచ్చిన ముఖ్య నాయకులను చంద్రబాబుకు పరిచయం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



షేక్ దరియావలి మృతదేహం

పంగులూరు, జూన్ 18 : మండలంలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండమూరుకు చెందిన షేక్ దరియావలి (24) మృతి చెందాడు. ఎస్‌ఐ తిరుపతిరావు అందించిన సమాచారం మేరకు.. కొండమూరు గ్రామానికి చెందిన షేక్ దరియావలి ద్విచక్ర వాహనంపై ముప్పవరంవైపు వెళుతూ రేణంగివరం సమీపంలో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. బేల్దారీ పనులు చేస్తూ జీవనం సాగించే దరియావలికి ఏడాది క్రితమే వివాహమైంది. గర్భవతి అయిన భార్యను సోమవారం చిలకలూరిపేటలోని పుట్టింటి వద్ద వదిలిపెట్టి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో బ్రిక్స్ లోడుతో ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దరియావలి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్‌ఐ తిరుపతిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే అగ్రిల్యాబ్..!

పూర్తైనచోట అలంకారప్రాయంగా కేంద్రాలు, కొన్ని అసంపూర్తిగా..

ఆశయం ఘనం.. ఆచరణ శూన్యం

కొన్నిచోట్ల ప్రారంభించి ఏడాదైనా అరకొర పరీక్షలే

మార్కాపురంలో పూర్తికాని భవన నిర్మాణం

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులోకి కష్టమే



మార్కాపురంలో ఇంకా నిర్మాణం పూర్తికాని అగ్రిల్యాబ్

మార్కాపురం, జూన్ 18 : గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఐఎండీ చెబుతోంది. మండు వేసవిలో కూడా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వాతావరణ పరిస్థితులు ఆశాజనంగా ఉండటంతో రైతాంగం కూడా పంటల సాగుకు సన్నద్ధమవుతోంది. గతేడాది జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలు, ఎరువుల వలన ఆశించిన దిగుబడులు రాక రైతన్నలు ఆర్థికంగా చితికిపోయారు. రైతాంగాన్ని నకిలీల బారినుంచి కాపాడేందుకు గత ప్రభుత్వం అగ్రిల్యాబ్ పేరుతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2023 జూలై 8న వాటిని ప్రారంభించారు. నియోజకవర్గస్థాయిలో విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించేందుకు రూ.3 కోట్లు కేటాయించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అందులో రూ.50 లక్షలు భవన నిర్మాణానికి, రూ.2.5 కోట్లు యంత్ర సామగ్రికి కేటాయించారు. అయితే వాటిని పూర్తి చేసే విషయంలో చిత్తశుద్ధి లేకపోవడంతో అవి అందుబాటులోకి రాలేదు. కొన్ని భవనాలు పూర్తయినా పరీక్షలు ప్రారంభం కాలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి.

> అగ్రి ల్యాబ్‌ల ఏర్పాటు ఆశయం ఘనంగా ఉన్నా ఆచరణలో మాత్రం గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఆ ల్యాబ్‌లకు భవన నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నా చాలాచోట్ల పూర్తికాలేదు. కొన్నిచోట్ల పూర్తయినా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించక ల్యాబ్‌లు అందుబాటులోకి రాలేదు. దీంతో అవి అలంకారప్రాయంగా మారాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలుకానుండడంతో ముందుగానే విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షించాల్సి ఉంది. దుకాణాల నుంచి ఆయా మండలాల వ్యవసాయాధికారులు ఇప్పటికే విత్తనాలు, ఎరువుల శ్యాంపిల్స్ సేకరించారు. నేటికీ ల్యాబ్‌లు అందుబాటులోకి రాకపోవడంతో రైతులకు మేలు చేకూరుతుందనుకోవడం అసాధ్యంగానే కనిపిస్తోంది.

మార్కాపురంలో ప్రారంభానికే అవరోధాలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో అగ్రిల్యాబ్ నిర్మించేందుకు స్థలం కేటాయించారు. 2022లోనే పనులు ప్రారంభమయ్యాయి. సంవత్సరం దాటినా కాంట్రాక్టర్ బేస్‌మెంట్ లెవెల్ లోనే పనులు పూర్తి చేశాడు. దీంతో మరో కాంట్రాక్టర్‌కు త్వరగా పూర్తిచేయాలని పనులు అప్పగించారు. కానీ నేటికీ పూర్తిస్థాయిలో భవన నిర్మాణం కాలేదు. ప్రస్తుత పరిస్థితి చూస్తే మరో ఆరు నెలలైనా పట్టే అవకాశం ఉంది. ఈలోపు ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కూడా ముగుస్తుంది. ఇప్పటికే ల్యాబ్‌కు కేటాయించిన సిబ్బంది విధుల్లేక ఖాళీగా ఉన్నారు.

పలుచోట్ల అందుబాటులోకి రానివైనం

మార్కాపురంలో నిర్మాణం పూర్తికాక ప్రారంభంకాలేదు. కానీ జిల్లాలోని దర్శి, సంతనూతలపాడుల్లోని అగ్రిల్యాబ్‌లు ఇంకా పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. జిల్లాలోని అన్ని ల్యాబ్‌లలో గతేడాది కేవలం విత్తనాలకు సంబంధించిన పరీక్షలు మాత్రమే చేశారు. ఒక్కో ల్యాబ్‌కు సుమారు 30 రకాల పరికరాలు రావాల్సి ఉండగా 14 మాత్రమే వచ్చాయి. గత సంవత్సరం నుంచి ఒక్కొక్కటిగా వస్తుండటంతో పూర్తిస్థాయిలో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు అవరోధం ఏర్పడుతోంది.

నష్టపోనున్న పశ్చిమ రైతులు

జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మార్కాపురం డివిజన్. ఇక్కడ వర్షాధారంతో, అవరోధాల నడుమ రైతాంగం వ్యవసాయం చేస్తోంది. తూర్పు ప్రకాశంతో పోలిస్తే విత్తనాలు, ఎరువుల ఎంపిక విషయంలో అవగాహన చాలా తక్కువ. ఈ అవకాశాన్నే వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నేళ్లుగా పత్తి, మిరపలు సాగు చేసిన రైతులు నకిలీ విత్తనాల బెడదతో తీవ్రంగా నష్టపోయారు. లైసెన్స్‌లు లేని నర్సరీలు కూడా రైతాంగం నష్టపోయేందుకు కారణమయ్యాయి. వ్యవసాయశాఖ వారి నుంచి శాంపిల్స్ సేకరించి పరీక్షలు సక్రమంగా చేయిస్తే ఇబ్బందులు తప్పేవే. ఆ దిశగా యంత్రాంగం చొరవచూపడం లేదు. అగ్రిల్యాబ్‌లు అందుబాటులో ఉంటే బహిరంగ మార్కెట్‌లో రైతులు విత్తనాలు కొనుగోలు చేసినా కనీస రుసుము చెల్లించి పరీక్షలు చేయించుకోవచ్చు. కానీ అవి ఉత్సవ విగ్రహాల్లా మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

జిల్లాకు కరువు బృందం

నేటి రాత్రికి రాక, రేపు అధికారులతో సమీక్ష, క్షేత్రస్థాయి పర్యటన

గతేడాది రబీలో కరువు నష్టాలు పరిశీలన

నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు



కరువు బృందం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు

ఒంగోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నలుగురు సభ్యులతో కూడిన కేంద్రప్రభుత్వ బృందం జిల్లాకు రానుంది. గతేడాది రబీ సీజన్‌లో కరువు తీవ్రతతో జరిగిన నష్టాలు, జనం ఇక్కట్లు పరిశీలన చేయనున్నారు. అందుకు సంబంధించిన సమాచారంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యారు. తదనుగుణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గత ఏడాది రబీ సీజన్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాలు కరువు బారిన పడ్డాయి. పంటలు దెబ్బతినడంతోపాటు నీటి కోసం ప్రజానీకం ఇక్కట్లు పడ్డారు. అయితే కరువు తీవ్రతను గుర్తించడంలో తగు సహాయక చర్యలు తీసుకోవడంలో నాటి వైసీపీ ప్రభుత్వం సకాలంలో స్పందించలేదు. ఎన్నికల కోడ్ సమీపిస్తున్న వేళ మార్చి 7న కరువు ప్రాంతాలు ప్రకటన చేసింది. ఎన్నికల అనంతరం మేలో పంట నష్టాలపై అధికారులు జాబితాలను రూపొందించి కేంద్రానికి నివేదించారు. స్థానికంగా నెలకొన్న నీటి ఇక్కట్లపై కొంత చర్యలను అధికారులు చేపట్టారు. కాగా ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కేంద్రప్రభుత్వం కరువు పరిస్థితులపై స్పందించింది. రాష్ట్రంలో రబీ సీజన్ కరువు పరిశీలన పేరుతో కేంద్రప్రభుత్వ అధికారులు ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు పర్యటన చేయనున్నారు. మొత్తం మూడు బృందాలు అలా పర్యటించనుండగా అందులో ఒక బృందం బుధ, గురువారాల్లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రానుంది. కేంద్రప్రభుత్వ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ నేతృత్వంలో జలసంరక్షణ శాఖ డైరెక్టర్ మన్నుజీ ఉపాధ్యాయ, ఆహార ప్రజా పంపిణీ శాఖ డిప్యూటీ సెక్రటరి మదన్ మోహన్ మౌర్య, నీతి ఆయోగ్ సీనియర్ పరిశోధకురాలు అనురాధభటేలతో కూడిన బృందం జిల్లాకు వస్తున్నది. బుధవారం నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకొని సాయంత్రానికి ఒంగోలు చేరుకునే కేంద్ర బృందం సభ్యులు రాత్రికి ఇక్కడి ఎన్ఎస్‌పీ అతిథిగృహంలో బస చేస్తారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం తర్లుపాడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లో పర్యటించి ప్రజలను కలుసుకొని కరువు తీవ్రతతో వారు పడిన ఇక్కట్లను తెలుసుకుంటారు. అక్కడి నుంచి రాత్రికి విజయవాడ చేరుకుంటారు. కాగా కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ ఖరారుతో అధికార యంత్రాంగం తదనుగుణ చర్యలు చేపట్టింది. రబీ సీజన్‌తో పంట నష్టాలపై ఇప్పటికే వ్యవసాయ శాఖ సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించింది. ఆ ప్రకారం జిల్లాలోని 22 మండలాల్లో 36,147 మంది రైతులు 29,713 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు తేల్చారు. వ్యవసాయశాఖ అధికారులు ఆ నివేదికలను సిద్ధం చేయగా ఇరిగేషన్ చెరువుల్లో చుక్కనీరు లేక ప్రజలు, పశువులకు ఎదురైన అవస్థలు, గ్రామాల్లో తాగునీటి సమస్య ఇతరత్రా అంశాలపై ఆయా శాఖల అధికారులు నివేదికలను సిద్ధం చేశారు.

ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సీపీవో వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాసరావు, విపత్తుల నిర్వహణ శాఖ డీపీఎం మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, ఇతర అధికారులు భేటీ అయ్యి చర్చించారు. కేంద్ర బృందం పర్యటన షెడ్యూల్ శాఖల వారీ నివేదికలపై చర్చించారు.

టీడీపీ ఫ్లెక్సీని చింపిన గుర్తుతెలియని వ్యక్తులు



చించేసిన ఫ్లెక్సీ

కురిచేడు, జూన్ 18 : మండలంలోని గంగదొన కొండలోని గంగాభవాని ఆలయం వద్ద తెలుగుదేశం పార్టీ వారు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, దర్శి నియోజకవర్గ నాయకురాలు గొట్టిపాటి లక్ష్మితో కూడిన పెద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చింపి ఆలయంలో పడవేశారు. ఈవిషయమై గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 61శాతం ఉత్తీర్ణత

ప్రైవేటు కంటే ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు

బాలబాలికలు సమానంగా పాస్

ఒంగోలు(విద్య), జూన్ 18: ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 61శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో 12వ స్థానంలో నిలిచారు. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత 59శాతం కంటే జిల్లా విద్యార్థులు రెండుశాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల విశేషమేమిటంటే బాలబాలికలు సమానంగా 61శాతం చొప్పున ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ ఫలితాల్లో ప్రైవేటు కళాశాలల కంటే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులు 59.5 శాతం మంది ఉత్తీర్ణుల కాగా ప్రభుత్వరంగ కళాశాలల విద్యార్థులు 13శాతం అదనంగా 72.5శాతం ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో ఇంటర్ జనరల్ విద్యార్థులు 5,487 మంది పరీక్షకు హాజరు కాగా 3,330 మంది పాసై 61శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 862మంది పరీక్షకు హాజరు కాగా 534 మంది ఉత్తీర్ణులై 61శాతం ఉత్తీర్ణత సాధించారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 933 మంది పరీక్షకు హాజరు కాగా 698 మంది ఉత్తీర్ణులై 74.6శాతం ఉత్తీర్ణత సాధించారు. అర్ధవీడు, టంగుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు 100శాతం పాసయ్యారు.,

-ఏపీ మోడల్ స్కూలు జూనియర్ కళాశాలల్లో 154 మందికిగాను 89 మంది ఉత్తీర్ణులయ్యారు. 57.8శాతం ఉత్తీర్ణత సాధించారు. దోర్నాల కళాశాల 96.0, దర్శిలో 64.52శాతం పాసయ్యారు.

- హైస్కూలు ప్లస్‌లో 48 మందికిగాను 34మంది ఉత్తీర్ణులయ్యారు. 70.8శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పాకల, హెచ్.నిడమానూరు, కొణిజేడు హైస్కూలు ప్లస్‌లు అధిక ఉత్తీర్ణత సాధించారు.

- కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయంలో 197 మంది పరీక్షకు హాజరుకాగా 153 మంది పాసయ్యారు. 77.66శాతం మంది ఉత్తీర్ణత సాధించగా పెద్దారవీడు, పుల్లలచెరువు, సీఎస్‌పురం, అర్ధవీడు, బేస్తవారిపేట, దొనకొండ, ముండ్లమూరు, పొన్నలూరు, రాచర్ల కేజీబీవీల్లో అధిక ఉత్తీర్ణత సాధించారు.

-ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో 97 మంది పరీక్షకు హాజరు కాగా 63 మంది పాసయ్యారు. 66.9శాతం ఉత్తీర్ణత సాధించారు. కంభం, కొండపి, చీమకుర్తి అధిక ఉత్తీర్ణత సాధించారు.


- ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నుంచి 12 మందికిగాను 9మంది పాసై 75శాతం ఉత్తీర్ణత సాధించారు.

- ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి 4,046 మందికి 2,286 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ కార్యాలయాలు వెలవెల

- ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకోని అధికారులు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దర్శి తహసీల్దార్ కార్యాలయం

దర్శి, జూన్ 18: అధికారులు ఎన్నికల మూడ్ నుంచి ఇంకా తేరుకున్న ట్లు కనిపించటం లేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి పది రోజులు అవుతున్నప్పటికీ కొంతమంది అధికారులు ఇంకా కార్యాలయాల మొఖం చూడలేదు. వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలు అధికారులు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పటి వరకు అధికారులు అందుబాటులోకి రాలేదు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావటంతో వ్యవసాయ రుణాలు తీసుకునేందుకు పట్టాదారు పాసుపుస్తకం, ఆన్‌లైన్ రికార్డులు తప్పనిసరిగా కావాల్సి ఉంది. ఈనేపథ్యంలో అధికారులు అందుబాటులో లేకపోవటంతో ఏంచేయాలో పాలుపోక అల్లాడుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మినహా మిగిలిన అధికశాతం మంది అధికారులు అందుబాటులో లేరు. ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈనెలలో రేషన్ బియ్యం పంపిణీ సక్రమంగా జరగలేదు. అధికారులు పట్టించుకోకపోవటంతో అరకొరగా పంపిణీచేసి 10వ తేదికి ముగించారు. అధికశాతం బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నాయకులు ప్రక్షాళన చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులను, వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారులను తక్షణమే పంపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

అన్నంపెట్టిన అమృతవల్లికి డబ్బులు వచ్చాయి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మార్టూరు, జూన్ 18 : అన్నం పెట్టాను డబ్బులు ఇప్పించండి సారూ అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించి పత్తిపాటి అమృతవల్లికి మహిళా రెవెన్యూ అధికారి మంగళవారం డబ్బులు పంపించారు. ద్రోణాదుల గ్రామానికి చెందిన అమృతవల్లి ప్రధాన సెంటర్‌లో చిన్న భోజన హోటల్‌ను నడుపుతున్నారు. గత నెల 13వ తేదీన పోలింగ్ రోజున సిబ్బందికి భోజనాలు అందజేయాలని మహిళా రెవెన్యూ అధికారి అమృతవల్లి సూచించారు. ఈ మేరకు గ్రా మంలో ఉదయం సాయంత్రం పోలింగ్ సిబ్బందికి, ఇతర సిబ్బందికి భోజనాల ప్యాకెట్లు, పెరుగు అన్నం ప్యాకెట్లను అమృతవల్లి పంపించారు. అందుకోసం రూ.11500 బిల్లు కాగా రూ.3వేలు మాత్రమే మహిళా అధికారి పంపించారు. మిగతా రావాల్సిన రూ.8500 చెల్లించుకుండా అమృత వల్లికి సమాధానం చెప్పకుండా నిర్లక్ష్య వైఖరితో ఉన్నారు. దాంతో అమృతవల్లి ఆవేదనను ఆంధ్రజ్యోతి కథనంలా ప్రచురించింది. దీనిపై స్పందించిన మహిళా రెవెన్యూ అధికారి గ్రామ నౌకరు ద్వారా మంగళవారం అమృతవల్లికి రావాల్సిన డబ్బులను పంపించారు. నెల రోజులకుపైగా ఎదురు చూసిన అమృతవల్లికి డబ్బులు రావడంతో ఆమె ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపింది.

వేలం ప్రకటన

పర్చూరు, జూన్ 18 : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బంది సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఎం.భుజంగరావు మంగళవారం తెలిపారు. డిస్కవరీ, హీరో హోండా బైకుల వేలం వేస్తున్నట్లు తెలిపారు.

ఏలూరికి అభినందనల వెల్లువ

- క్యాంపు కార్యాలయంలో సందడేసందడి
- ఎమ్మెల్యేకి పుస్తకాలు, పూల మొక్కల బహూకరణ


ఏలూరికి పుస్తకాలను అందజేస్తున్న ప్రజలు

మార్టూరు, జూన్ 18 : ఇసుక దర్శి ఏలూరి క్యాంప్ కార్యాలయం మంగళవారం సందడి వాతావరణం కన్పించింది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అభినందనలు వెల్లువెత్తాయి. ఒక వైపు పార్టీనాయకులు, కార్యకర్తలు మరో వైపు ఉద్యోగులు, అధికారులతో కిటకిటలాడింది. మూడోసారి గెలుపొందిన ఏలూరి హ్యాట్రిక్ విజయం సాధించారు. దీంతో భారీగా ప్రజానీకం, ఉద్యోగులు తరలి వచ్చారు. బాపట్ల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గంధం రవీంద్ర, పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఏలూరిని కలిసి అభినందించారు. అదేవిధంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా యానిమేటర్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును ప్రత్యేకంగా అభినందించారు. అభినందించేందుకు వచ్చే వారిని పుష్పగుచ్ఛాలు, శాలువాలను తీసుకురావద్దని క్యాంప్ కార్యాలయం వారు చెప్పడంతో బాపట్ల ఆర్‌డీవో రవీంద్ర పూలమొక్కను ఏలూరికి అభినందనగా అందచేశారు. మరి కొంతమంది స్కూళ్లల్లో విద్యార్థులకు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో పెన్నులు, పుస్తకాలను ఏలూరికి అందచేశారు. ఇంకా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు భారీగా ఏలూరి క్యాంపు కార్యాలయానికి తరలి వచ్చారు. ఎన్నికల ఓట్లు లెక్కింపు అనంతరం విజయం సాధించిన ఏలూరి సాంబశివరావును అభినందించడానికి గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ఎదురు చేశారు. దాంతో వారందరూ ఏలూరి క్యాంప్ కార్యాలయానికి తరలి వచ్చారు. అదేవిధంగా రెవెన్యూ విభాగం విద్యుత్ డిపార్టమెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్‌తోపాటు తదితర విభాగాల నుంచి ఇతర ప్రాంతాలలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు ఏలూరిని కలిసి అభినందించారు. గతంలో స్థానిక మండలాల్లో పనిచేసి ప్రస్తుతం ఇతర మండలాల్లో పనిచేసే ఉద్యోగులు మరలా ఈ మండలాలకు రావాలనే ఆకాంక్షతో కొంత మంది ఉద్యోగులు ఏలూరిని కలిసినట్లు తెలిసింది. అదేవిధంగా మార్టూరు, యద్దనపూడి మండలాల కు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఏలూరికి అభినందనలు తెలియ చేశారు. మొత్తం మీద మహిళ లు ఎర్రుప్క వగా ఏలూరిని కలిసి అభినందనలు, శుభాకాంక్షలను తెలియచేశారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి : ఏలూరి

కారంచేడు (పర్చూరు) : గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కారంచేడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి వెళ్లి హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే ఏలూరికి పుష్పగుచ్ఛాలు దుశ్శాలువాలు, చిరుకానుకలతో ఘనంగా సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏలూరి మా ట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోతిని ఉదయ్, నల్లగొర్ల శ్రీరాములు, మహిళా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఏలూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న కారంచేడువాసులు

గనుల శాఖ మంత్రికి అభినందనలు

కొల్లును కలిసిన బల్లికురవ, మార్టూరు గ్రానైట్ క్వారీ యజమానులు


మంత్రి రవీంద్రకు అభినందనలు తెలుపుతున్న గ్రానైట్ సంఘ నేత సురేష్

బల్లికురవ. జూన్ 19 : గనుల శాఖ మంత్రిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కొల్లు రవీంద్రను మంగళవారం విజయవాడలో బల్లికురవ గ్రానైట్ క్వారీ యజమాని, మార్టురు గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల సంఘం అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా గ్రానైట్ పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మంత్రికి సురేష్ వివరించారు. ఫ్యాక్టరీలలో వైసీపీ ఒత్తిడి చేసి తయారు చేయించిన సర్వే హద్దు రాళ్లు పెద్ద మొత్తంలో యజమానుల వద్ద ఉన్నాయని వీటిని తయారు చేసి గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులు తీవ్రంగా నష్టపోయారని అలానే విద్యుత్ చార్జీలు గతంలో వైసీపీ పలు మార్లు పెంచడం వలన పరిశ్రమల నిర్వహణ చాలా ఇబ్బందిగా ఉందని గతంలో కరోనా సమయంలో కూడా విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి తగ్గించలేదని అలానే రాయల్టీలు పెంచడం వలన తీవ్ర నష్టాలు వస్తున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. త్వరలో ఫ్యాక్టరీ యజమానులు, క్వారీ యజమానులతో మరో మారు గనుల శాఖ మంత్రి రవీంద్రను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి తమ సమస్యలను వారికి వివరిస్తామని ఈసందర్భంగా సురేష్ తెలిపారు.

ఖరీఫ్‌కు సిద్ధంగా ఉండాలి

వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్


విత్తన డీలర్లతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సంతమాగులూరు, జూలై 18 : రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తమై సిద్ధంగా ఉండాలని మార్టూరు వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఏల్చూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో విత్తనాల అధీకృత డీలర్లు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. కరీఫ్‌లో రైతులు సాగుచేసే పంటలు, అందుబాటులో ఉన్న విత్తనాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లావణ్య వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి గొర్రెల కాపరి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

మార్టూరు, జూన్ 18 : పిడుగు పాటుకు పొలంలో గొర్రెలను మేపుతున్న గోవాడ శ్రీనివాసరావు (52) మృతిచెందిన సంఘటన మంగళవా రం మధ్యాహ్నం మండలంలోని జొన్నతాళి గ్రామ పొలాల్లో జరిగింది. జొన్నతాళికి చెందిన శ్రీనివాసరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉ న్నారు. మంగళవారం గొర్రెలను మేపడానికి శ్రీనివాసరావు పొలానికి వెళ్లాడు. దాదాపుగా 2 గంటల సమయంలో ఆకాశంలో ఉరుములు మె రుపులతో భారీ వర్షం కురిసింది. దాంతో అతను గొర్రెలను వేరేచోటకు పం పించి సమీపంలో ఉన్న జమి చెట్టు కిందకు వెళ్లి నిలబడ్డాడు. ఈ సమయంలో పెద్దశబ్దంతో ఉరుములతో కూడిన పిడుగు ఆకాశం నుంచి చెట్టుపై నుంచి అతని భుజంపై పడింది. దాంతో అక్కడికక్కడే చనిపోయారు. అదే సమయంలో దూరంగా నిలుచున్న పిల్లవాడు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి అతని మృతదేహాన్ని ఇం టికి తీసుకువచ్చారు. ఆర్‌ఎంపీ వైద్యుడు అతనిని పరీక్షించి చనిపోయినట్లు ని ర్ధారించారు. మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కుప్పకూలిన కుటుంసభ్యులు

సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీనివాసరావుకు రెండెకరాలు పొలం ఉంది. వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో కౌలుకు కూడా పొలం తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. భార్య మల్లీశ్వరి కుమారుడు తిరుపతిరాయుడు, కుమార్తె అనూరాధ డిగ్రీ చదువుతున్నా కూడా పొలం పని చేస్తుంటారు. శ్రీనివాసరావుకు ఆర్థిక ఇబ్బందులున్నట్లు బంధువులు తెలిపారు. శ్రీనివాసరావు మృతితో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తమకు దిక్కెవరని విలపిస్తున్నారు. ప్రభుత్వం శ్రీనివాసరావు కుటుంబాన్ని ఆదుకోవాలని, అండగా ఉండాలని గ్రామస్థులు కోరారు.

పిడుగుపాటుకు కాపరికి గాయాలు

వేటపాలెం(చీరాలటౌన్) : మంగళవారం సాయంత్రం వీచిన పెనుగాలులకు ఓ వ్యక్తి గాయాలబారిన పడ్డాడు. ఈ ఘటన వేటపాలెం మండల పరిధిలోని అనుమోలుపేట శివారు పొలాల్లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పులి ఏడుకొండలు గొర్రెల కాపరి. మంగళవారం పెను గాలులు వీస్తుండడంతో పొలాల్లో ఉన్న గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. దీంతో సమీపంలోనే పిడుగు పడడంతో కుడి ఛాతీవైపు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యువకులపై ఎస్‌ఐ దాడి

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

అద్దంకి, జూన్ 18 : పోస్టుమార్టంకు తీసుకొచ్చిన మృతదేహం తరపు యువకులపై రేణింగవరం ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు తావిస్తుంది. రేణింగవరం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంగులూరు మండలం కొండమూరుకు చెందిన వ్యక్తి మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో ఉంచారు. ఈ నేపథ్యంలో రేణింగవరం ఎస్‌ఐ తిరుపతిరావు మంగళవారం మధ్యాహ్నం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఆ సమయంలో మృతి చెందిన వ్యక్తి తరపు యువకులు ఎస్‌ఐతో వాగ్వివాదానికి దిగినట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన వ్యక్తులను ఎందుకు అరెస్ట్ చేయలేదన్న విషయమై వాదన జరిగినట్లు తెలిసింది. దీంతో వాగ్వివాదానికి దిగిన యువకుడిపై ఎస్‌ఐ చేయి చేసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనలను ముప్పవరానికి చెందిన ఓ యువకుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీంతో ఎస్‌ఐ మరింత కోపోద్రిక్తుడై వీడియో తీసిన యువకుడుపై కూడా దురుసుగా వ్యవహరించినట్లు తెలుస్తుంది. అదే సమయంలో ఆ యువకుడి సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఎస్‌ఐ తిరుపతిరావుపై అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఆ యువకుడు ఫిర్యాదు కూడా చేసినట్లు తెలుస్తుంది.

మొబైల్ మరమ్మతులపై శిక్షణ

మేదరమెట్ల, జూన్ 18 : గ్రామీణ ప్రాంతాలలోని యువతకు మొబైల్ మరమ్మతులపై శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ఉపాధి కల్గుతుందని రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మేదరమెట్లలో రూడ్‌సెట్ ఆధ్వర్యంలో 25రోజుల పాటు శిక్షణ పొందిన వారితో మొబైల్ మరమ్మతుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని సెల్ వినియెగదారులకు అవసరమైన మరమ్మతులు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారి పనితనాన్ని పరిశీలించడంతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపయెగపడడానికి ఇటువంటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ బాపూజీ, శిక్షకుడు రాజశేఖర్‌రెడ్డి శిక్షణ పొందిన యువకులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరెడ్డి


బస్సు ముందు ఉపాధ్యాయులు, విద్యార్థినులు

బస్సు ఏర్పాటుపై విద్యార్థుల కృతజ్ఞతలు

పంగులూరు, జూన్ 18 : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభమైన వెంటనే విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా బస్సును ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చుట్టు పక్కల ఉన్న ఆరు గ్రామాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు నిత్యం పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరూ పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు వీలుగా అద్దంకి డిపో నుంచి పాఠశాలకు చేరుకునేలా సమయపాలన పాటిస్తూ అధికారులు బస్సును ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రారంభం నుంచే బస్సు వసతి ఏర్పాటు చేయడానికి తోడ్పాటు నందించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు అద్దంకి ఆర్టీసీ డీఎం రామ్మోహనరావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

బార్ అసోసియేషన్ ప్రతినిధుల సంబరాలు


కేక్ కటింగ్ నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

చీరాలటౌన్, జూన్ 18 : ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ హర్షణీయమని, ప్రజా క్షేమకరమైన నిర్ణయాలు టీడీపీతోనే సాధ్యమని పలువురు బార్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంబంధిత పత్రాలపై సంతకం చేశారు. దీంతో మంగళవారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ కేక్ కటింగ్ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. యజమానులు వారి కష్టార్జితంతో సంపాదించుకున్న ఆస్తులు దుర్వినియోగం కాకుండా యాక్టును రద్దు చేయడం హర్షించదగిన అంశమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాదులు ఉదయ భాస్కర్, మణి నాగశయన, సాయిబాబు, రమేష్ కుమార్, రవికుమార్, కస్తూరి, పవన్‌కుమార్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలంతా స్కూల్‌లో ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో, మండల కమిటీ చైర్మన్

అద్దంకి, జూన్ 18 : బడి ఈడు పిల్లలందరూ కచ్చితంగా పాఠశాలలలో ఉండేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో, మండల కమిటీ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో విద్యా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ జూలై 12వ తేదీ లోపు బడిఈడు పిల్లలను ఆయా హ్యాబిటేషన్‌ల పరిధిలో పాఠశాలలలో కచ్చితంగా చేర్పించాలన్నారు. విద్యార్థులందరూ బడిలోనే ఉన్నట్లు ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటినీ సందర్శించాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు పనిచేస్తుంటే సమీపంలోని హాస్టల్‌లో చేర్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, సీడీపీవో కృష్ణకుమారి, ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్‌లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం


క్లూస్ టీం ఆధారంగా వివరాలు సేకరించిన పోలీసులు



ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూన్ 18 : మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చెందారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి ఈపూరుపాలెం బాయ్స్ హైస్కూల్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌కే కాశిం సాహెబ్(58)కు భార్య గుల్జార్, కుమారుడు బాజీ మరో కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి. వీరిది హైస్కూల్ ఎదురు కూల్‌డ్రింక్ షాపు, లూజు పెట్రోల్‌ను విక్రయిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. కొంత కాలంగా సాహెబ్ అనారోగ్యంబారిన పడ్డారు. వైద్యం పొందుతున్నారు. ఆరోగ్య విషయాన్ని విస్మరించి సిగరెట్లు, బీడీలు తాగుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన సాహెబ్ అర్ధరాత్రి అందరూ నిద్రిస్తుండగా బాత్ రూంలోకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పటించుకున్నారు. ఈపూరుపాలెం ఎస్‌ఐ శివకుమార్ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బాత్‌రూంలో స్విచ్ బోర్డులు కాలిపోయి ఉన్నాయి. దీంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడా, లేక విద్యుత్ ప్రమాదానికి గురై చనిపోయారా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్కడున్న పెట్రోల్ డబ్బా, అగ్గి పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. చీరాల ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

సక్రమంగా ఉంటారా.. సర్దుకుంటారా..?

ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యే కొండయ్యకు బొకే అందజేస్తున్న చీరాల, వేటపాలెం మండలాల తహసీల్దార్లు

కొత్తపేట(చీరాల), జూన్ 18 : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు భిన్నంగా ఏది జరిగినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సక్రమంగా ఉంటారా.. లేక సర్దుకుంటారో వారే తేల్చుకోవాలని ఎమ్మెల్యే పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో స్పష్టం చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం చీరాల, వేటపాలెం మండలాల తహసీల్దార్లు నాసరయ్య, కృష్ణకాంత్ ఎమ్మెల్యే కొండయ్యకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొండయ్య పలు శాఖల అధికారులు, బాధ్యులతో వేర్వేరుగా సమీక్షలు నిర్వహించారు. కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శకాలను చెప్తూ అందరికీ సమన్యాయం జరగాలి, పరిపాలన పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు.

అనధికారిక లేఅవుట్లను ప్రోత్సహించొద్దు

నియోజకవర్గంలో ఎక్కడైనా అనధికారిక లేఅవుట్లు వేస్తే ప్రోత్సహించవద్దని ఎమ్మెల్యే కొండయ్య అధికారులకు స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాలను బట్టి ఒడా (ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ), డీటీసీపీ (డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) నుంచి పక్కాగా అనుమతులు పొందాలన్నారు.

పంట కాలువలు బాగుచేయాలి

రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ముందస్తుగా పంటకాలువలను పూర్తి స్థాయిలో బాగుచేయాలని ఎమ్మెల్యే కొండయ్య వ్యవసాయశాఖ, నీటిపారుదలశాఖ అధికారులకు చెప్పారు. ఎత్తిపోతల పథకాలకు పూర్తి స్థాయిలో పనిచేసేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. రైతులకు పారదర్శకంగా సేవ లందించాలన్నారు. వ్యవసాయ, నీటిపారుదల, రెవెన్యూ, సచివాల అధికారులు పాల్గొన్నారు.

దండలు వద్దు.. ఆ ఖర్చును సద్వినియోగం చేద్దాం

తనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపేందుకు వచ్చే వారు పూల దండలు, బొకేలు, శాలువాలు తీసుకు రావద్దని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. వాటికోసం చేసే ఖర్చును పేదల ప్రయోజనం కోసం వినియోగిస్తే బాగుంటుందని సూచించారు. ఆ క్రమంలో ఎమ్మెల్యేకు అభినందులు తెలిపేవారు దండలు, బొకేలు, శాలువాలకు బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా పెన్నులు, పుస్తకాలు తెస్తే బాగుంటుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు సూచించారు. ఈ విషాయన్ని అందరూ గమనించాలని వారు కోరారు.


అనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

హోం మంత్రిని కలిసిన నేతలు

చినగంజాం, జూన్ 18 : హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను టీడీపీ మండల నాయకులు మంగళవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసారు. హోం శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనితకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, మోటుపల్లి గ్రామ సర్పంచ్ వడ్లమూడి సాంబశివరావు, నాయకులు సందు శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగ అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీహరి బాబు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

చీరాల రైల్వే స్టేషన్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, జూన్ 18 : చీరాల రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెం-4లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం ప్లాట్‌ఫాంపై వేసిన షెడ్డు పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు రేకులకు తగిలి ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటల వ్యాపించాయి. అదే సమయంలో ప్లాట్‌ఫాం నెం-5లో గూడూరు - విజయవాడ ప్యాసింజర్ రైలు ఆగి ఉంది. ఈ ఘటనతో ప్రయాణికులు కలవరపడ్డారు. వెంటనే అధికారులు స్పందించి మంటలను అదుపు చేయడంతో పరిస్థితి చక్కబడింది.


రైల్వే ప్లాట్‌ఫాంపై మంటలు


గుండ్లకమ్మలో పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎస్ఈబీ ఎస్ఐ

ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలన

అద్దంకి, జూన్ 18 : గుండ్లకమ్మ నది, రిజర్వాయర్ ప్రాంతంలో ఇసుక అ క్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించారు. మండలంలోని మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్ లో, అద్దంకి పట్టణానికి సమీపంలో గుండ్లకమ్మ నదిలో జరిగిన ఇసుక తవ్వకాలను తహసీల్దార్ మహబూబ్ సుభాని, ఎస్ఈబీ ఎస్ఐ సైమన్‌తో పాటు మైనింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులు పంపనున్నట్లు సమాచారం.

ప్రతి వారం ఇసుక నిల్వల తనిఖీ

మేదరమేట్ల, జూన్ 18 : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇసుక నిల్వలను పరిశీలించి నివేదికలను అందజేస్తున్నామని మైనింగ్ డీఐ తిరుపతిరావు తెలిపారు. అందులో భాగంగానే మంగళవారం అనమనమూరు వద్ద ఇసుక నిల్వలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా ఎక్కడా ఇసుక తవ్వకాలు చేయొద్దన్నారు. అక్రమంగా ఇసుక తవ్వినా, రవాణా చేసిన చర్యలు తప్పవని డీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ సైమన్, ఏఈ నరసింహారావు పాల్గొన్నారు.

కందుకూరు, అద్దంకిని ప్రకాశంలో కలపాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 18 : కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలపాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు మంగళవారం ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలుపుతానని హామీ ఇచ్చినందున ఆ చర్యలను తీసుకోవాలన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు ప్రజల మనోభావాలకు విరుద్ధంగా వైసీపీ ఏర్పాటు చేసిందన్నారు. దీంతో ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మార్కాపురంను జిల్లాగా ప్రకటించాలని కోరారు.

కనులపండువగా స్వర్ణమ్మ తిరునాళ్ల

- భక్తులతో కిక్కిరిసిన ప్రాంగణం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

స్వర్ణ (పర్చూరు), జూన్ 18 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల వేడుకలు మంగళవారం కనులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో ఆనందంగా ఉండాలని స్వర్ణమ్మని మొక్కుకున్నారు. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామ నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఘటం, కుండలు, మాతంగి, తప్పెట్లతో గ్రామం మారుమోగింది. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యాదర్శి చెన్నారెడ్డి వేణుగోపాలరావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ అమ్మవారు



ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్‌వో లవన్న తదితరులు(ఫైల్)

నాటి తప్పులకు

నేడు శిక్ష?

- ఇరిగేషన్ శాఖలో బిల్లులకు బ్రేక్
- అన్నింటినీ నిలిపివేయాలని ఆదేశాలు
- పంపిన బిల్లులు కూడా వెనక్కు..
- అధికారుల మెడపై నాడు కత్తిపెట్టిన వైసీపీ నేతలు
- పనులు చేయకనే నగదు కాజేసే కుట్ర
- గత ప్రభుత్వ అక్రమాలపై ఎమ్మెల్యేల దృష్టి

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని పెద్దలు అంటుంటారు... ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో ఇది మరోసారి రుజువుకానున్నది. నాడు అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన అరాచకాలకు మూల్యం చెల్లించుకునే రోజులు వచ్చాయి. పనులు చేయకనే బిల్లులు తినేయడం... తూతూమంత్రంగా పనులు చేసి భారీగా బిల్లులు పెట్టుకోవడం.. వంటి అక్రమాలు ఇరిగేషన్ శాఖలో విచ్చలవిడిగా జరిగాయి. అధికారులు ససేమిరా అన్నా వారి మెడపై కత్తి పెట్టి మరీ వైసీపీ నాయకులు దోపిడీ సాగించారు. అందులోనూ ఎఫ్‌డీఆర్, ఓఅండ్‌ఎం మాటున జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. మరీ ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాల్లో విచ్చలవిడిగా వ్యవహరించారు. టెండర్లు పూర్తవకుండానే పనులు మొదలుపెట్టడం, అవసరం లేకున్నా అగ్రిమెంట్లు రివైజ్ చేసి విలువ పెంచడం, గడువు ముగియకుండానే బిల్లులు అప్‌లోడ్ చేయడం వంటి అనేక చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. చివరి ఏడాదిలో రూ.కోట్ల బిల్లులు సిద్ధమయ్యాయి. వీటిలో కొన్ని బిల్లులు ఇప్పటికే సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ కాగా, మరికొన్ని అప్‌లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

బిల్లులకు బ్రేక్

ఈ క్రమంలో తాజాగా ఈ బిల్లులన్నింటికీ బ్రేక్ పడింది. తాత్కాలికంగా అన్ని బిల్లులను నిలుపుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను కూడా వెనక్కు తెప్పిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు రూ.వందల కోట్లు అడ్డగోలుగా దోచుకోగా, ఆ దోపిడీకి ఇప్పుడు బ్రేక్ పడింది. కాగా కొందరు ఇరిగేషన్ అధికారులు ఈ బిల్లులను వైసీపీ నాయకుల చేతికి ఇచ్చి కోర్టుకు వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారన్న సమాచారం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఇరిగేషన్ శాఖ నుంచి ఒక్క ఫైలు కూడా బయటకు వెళ్లేందుకు వీల్లేదని అక్కడి నుంచి ఆదేశాలు అందాయి.

అంతా బినామీ కాంట్రాక్టర్లే..!

వైసీపీ ప్రభుత్వంలో ఎఫ్‌డీఆర్, ఓఅండ్‌ఎం మాటున భారీ దోపిడీ జరిగింది. మంజూరైన పనులు.. జరిగిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. వీటిలో చాలావరకు మట్టి పనులు కావడంతో లెవల్స్ కూడా రికార్డు చేయకుండానే బిల్లులు చేసేలా వైసీపీ నేతలు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఆఖరుకు షట్టర్లు కూడా ఏర్పాటు చేయకుండానే చేసినట్లుగా కూడా అధికారుల చేత సంతకాలు పెట్టించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఒక్క 2021లో ఎఫ్‌డీఆర్ కింద సుమారు రూ.230 కోట్లకు పైగా పనులు కలెక్టర్ చేత మంజూరు చేయించారు. ఇన్ని రూ.వందల కోట్లు ఎఫ్‌డీఆర్ కింద మంజూరు చేయడంపై రాష్ట్ర ఉన్నతాధికారులే ఆశ్చర్యపోయారు. ఆ మరుసటి ఏడాది మళ్లీ ఓఅండ్‌ఎం కింద మళ్లీ రూ.వందల కోట్ల పనులకు అనుమతులు తెచ్చారు. ఇలా అగ్రిమెంటు చేసుకోవడం.. అలా పనులు చేసినట్లు రికార్డు చేయడం.. వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయడం.. వాటిని పట్టుకొని హైకోర్టుకెళ్లడం.. వెంటనే బిల్లులు మంజూరు కావడం.. ఇదీ వైసీపీ ప్రభుత్వంలో సాగిన ప్రక్రియ. గతేడాది డిసెంబరులో చాలా వరకూ ఎఫ్‌డీఆర్ బిల్లులు మంజూరయ్యాయి. ఈ ఎఫ్‌డీఆర్, ఓఅండ్‌ఎం పనులన్నీ నాటి వైసీపీ ఎమ్మెల్యేల బినామీల ద్వారానే జరిగాయి. ఆ పది మంది కాంట్రాక్టర్లే మొత్తం పనులు చేశారు. ఒక్కో నియోజకవర్గంలో ఒకరిద్దరు కాంట్రాక్టర్ల పేరు మీద వర్కులు చేసినట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సెంట్రల్ డివిజన్ పరిధిలోని సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ ఐదేళ్లలో దాదాపు 650 వర్కులు జరిగినట్లుగా రికార్డుల్లో చూపిస్తున్నారు. ఈ వర్కులన్నింటిపై ఆ ముగ్గురి కాంట్రాక్టర్ల హవానే కొనసాగింది. ఒకరేమో నాటి ప్రజాప్రతినిధి ఆర్థిక వ్యవహారాలు చూసే వ్యక్తి కాగా, మరొకరేమో మనుబోలు మండలానికి చెందిన నాయకుడు. ఈ నాయకుడు తర్వాత కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. ఇంకొకరేమో నెల్లూరుకు చెందిన కాంట్రాక్టర్. వీరు చేసిన వర్కులపై విచారణ జరిపితే ఏ స్థాయిలో దోపిడీ జరిగిందో తేటతెల్లమవుతుంది.



దృష్టి పెట్టిన ఎమ్మెల్యేలు

ఇరిగేషన్ శాఖలో రైతుల మాటు వైసీపీ నేతలు సాగిస్తున్న దోపిడీపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడే టీడీపీ నేతలు పోరాటం చేస్తూ వచ్చారు. అనేక అవకతవకలను నాడే వెలుగులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు వారంతా అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో నాడు జరిగిన దోపిడీపై దృష్టి సారించారు. ఎమ్మెల్యేలంతా వారి పరిధిలో వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన, జరిగిన వర్కులు, బిల్లుల వివరాలను తెప్పించు కుంటున్నారు. వీటిని లోతుగా పరిశీలిస్తున్నారు. అదే సమ యంలో ఇరిగేషన్ అధికారులు కూడా నాటి పరిస్థితులను ఎమ్మెల్యేలకు వివరిస్తున్నారు. నాడు చేసిన ఆరోపణలు నిజమని ప్రజలకు వివరించేం దుకు ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నారు. కాగా నాడు వైసీపీ నేతలు సాగించిన దోపిడీ దెబ్బకు నేడు ఇరిగేషన్ సిబ్బంది విలవిల్లాడి పోతున్నారు. తప్పులను తాము ఒప్పుకోక పోయినా ఉన్నతస్థాయిలో ఒత్తిడి తెచ్చి మెడపై కత్తి పెట్టారని కొందరు అధికారులు వాపోతుండడం గమనార్హం.

ఇంటర్ సప్లిమెంటరీలో

4వ స్థానం

- ఒకేషనల్‌లో 2వ స్థానం
- ద్వితీయ సంవత్సరం ఫలితాల విడుదల

నెల్లూరు (విద్య), జూన్ 18: ఇంటర్ ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంగళవారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫలితాల్లో జనరల్ విభాగంలో జిల్లా రాష్ట్రంలో 4వ స్థానం సాధించగా, ఒకేషనల్ విభాగంలో 2వస్థానంలో నిలిచింది. జనరల్ విభాగంలో 4,970 మంది పరీక్ష రాయగా, 3,675 మంది ఉత్తీర్ణులై 74శాతం ఫలితాలు సాధించారు. ఒకేషనల్ విభాగంలో 412 మందికి 325 మంది ఉత్తీర్ణత సాధించి 79శాతం ఫలితాలు సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల విభాగంలో 13, ప్రైవేట్ కళాశాలల్లో 17 జూనియర్ కళాశాలలు వంద శాతం ఉత్తీర్ణతను సొంతం చేసుకున్నాయి. సంక్షేమ గురుకుల పాఠశాలలు 97శాతం, ఎయిడెడ్ కళాశాలలు 89శాతం, కస్తూర్బా కళాశాలలు 76శాతం ఫలితాలను దక్కించుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్‌ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, కళాశాలల ప్రిన్సిపాళ్లను అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు, విద్యా ప్రమాణాలను మరింత పెంచేలా అంతా కృషి చేయాలన్నారు. ఈనెల 26న మొదటి సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్‌బోర్డు చర్యలు చేపట్టిందని వివరించారు.

ఏపీ పీజీఈ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

- వివిధ విభాగాల్లో ఆరుగురికి పదిలోపు ర్యాంకులు

నెల్లూరు (విద్య), జూన్ 18: ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం (ఎస్వీయూ) నిర్వహించిన ఏపీ పీజీఈ సెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లాలోని పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో కోవూరుకు చెందిన కొప్పోలు కార్తీక్ 2వ ర్యాంక్, సివిల్ ఇంజనీరింగ్‌లో నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌కు చెందిన నాగల ఉషాలక్ష్మి 7వ ర్యాంకు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో ఇందుకూరుపేట మండలం గంగపట్నం పల్లిపాళెంకు చెందిన వెయ్యాల అమీషా ఒకటవ ర్యాంక్, ఫుడ్ అండ్ టెక్నాలజీలో నెల్లూరు హరనాథపురానికి చెందిన అనుసూరి గౌతమిప్రియ 8వ ర్యాంక్, మెకానికల్ ఇంజనీరింగ్‌లో కూకటి పవన్‌కళ్యాణ్ 6వ ర్యాంక్, నానో టెక్నాలజీలో ఇందుకూరుపేట మండలం జంగంవారిదొరువుకు చెందిన ఆములూరు జాన్‌డేవిడ్ రెండో ర్యాంక్ సాధించినట్లు సెట్ చైర్మన్, ఎస్వీయూ వైస్‌చాన్స్‌లర్ వీ శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.



మంగళవారం రాత్రి నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి చేరుకున్న కేంద్రం బృందం సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్‌వో రమణ, ఆర్డీవో మలోల

నేడు కేంద్ర బృందం పర్యటన

నెల్లూరు(హరనాథపురం), జూన్ 18: జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించిన నష్టాలను అంచనా వేసేందుకు బుధవారం కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనుంది. కేంద్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ సందీప్ శర్మ నేతృత్వంలో మన్ను జీఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్య జిల్లాలో పర్యటించనున్నారు. ముందుగా వారు ఉదయం 10 గంటలకు కలెక్టర్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారు. 11.30 గంటలకు వర్షాభావ పరిస్థితుల వల్ల జరిగిన నష్టాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. ఈ సందర్భంగా కరువు నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వారికి వివరిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నెల్లూరు నుంచి బయలుదేరి కలిగిరి మండలం గంగిరెడ్డిపాలెం చేరుకుంటారు. అక్కడి రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం తెల్లపాడు చేరుకొని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, రైతులతో మాట్లాడతారు. సాయంత్రం ఐదు గంటలకు కొండాపురం మండలం గొట్టిగుండాల గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. తదుపరి గొట్టిగుండాల నుంచి ఒంగోలుకు చేరుకుంటారు. కాగా కేంద్ర బృందం సభ్యులు మంగళవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు.



అశ్వవాహనంపై చాముండేశ్వరి విహారం

ఇందుకూరుపేట, జూన్ 18 : మండలంలోని గంగపట్నం గ్రామంలో వెలిసి ఉన్న చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అశ్వవాహనంపై అమ్మవారు పురవీధుల్లో విహరించారు. ఉభయ కర్తలుగా మూలగల ప్రదీప్, పుల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి, సోమరాజుపల్లి కార్తీక్ సాయి, వైశ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో బండి శాంతయ్య, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

68కి ప్రతిపాదనలు.. 24 కేటాయింపు !

- ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ సీట్ల పరిస్థితి
- రూ. 89 లక్షలు ఎన్‌ఎంసీకి చెల్లింపులు
- మరోసారి అన్నింటికి ప్రపోజల్స్
- పూర్తిగా మంజూరైతేనే మెరుగైన సేవలు



నెల్లూరు (వైద్యం), జూన్ 18 : జిల్లాలోని ప్రభుత్వ వైద్య విద్య కళాశాలలో పీజీ సీట్ల కేటాయింపు నిరాశజనకంగా ఉంది. పీజీ సీట్ల కోసం కళాశాల తరపున రూ.లక్షలు చెల్లిస్తున్నా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) కేవలం కొన్ని సీట్లనే మాత్రమే కేటాయిస్తున్నది. 2023లోనే 68 పీజీ సీట్లకు రూ.89 లక్షలు చెల్లించగా, కేవలం 24 పీజీ సీట్లను మాత్రమే కేటాయించింది. తాజాగా ఈ ఉత్తర్వులు ప్రభుత్వ వైద్య కళాశాలకు చేరాయి. ఇందులో జనరల్ మెడిసిన్‌కు 17 సీట్లు కావాలని కోరగా, మొత్తం సీట్లకు అనుమతులు వచ్చాయి. అలాగే గైనకా లజీలో 15 సీట్లు కోరగా ఏడుసీట్లు కేటాయించింది. ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ , చెవి, ముక్కు, గొంతుతో పాటు రేడియాలజీ విభాగాలకు పీజీ సీట్లు కేటాయించలేదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య కళాశాలలకు కోరుకున్న పీజీ సీట్లు వచ్చాయి. అయితే, నెల్లూరు కళాశాలకు మాత్రం రిక్తహస్తం చూపడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



డాక్టర్ వసుంధరాదేవి

గతంలోనూ ఇంతే..

గతంలో కూడా పీజీ సీట్ల కేటాయింపులో వివక్ష తప్పలేదు. 2022-23 విద్యా సంవత్సరానికిగాను పీజీలో 130 సీట్లు వస్తాయని ఆశించిన అధికారులకు చివరకు నిరాశే మిగిలింది. కేవలం 23 సీట్లకే అనుమతులు ఇస్తూ ఎన్‌ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర విభాగాల్లోనూ పీజీ సీట్లకు అనుమతులు ఇవ్వకపోవటంతో వైద్యవర్గాల్లో అసంతృప్తి నెలకొంది. కాగా అనుకున్న స్థాయిలో పీజీ సీట్లు మంజూరయితే, పీసీ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు మెరుగుపడే అవకాశం ఉంది. తాము కోరినన్ని సీట్లు రాక పోవడంతో మరోసారి ప్రతిపాదనలు పంపనున్నట్లు ప్రిన్సిపాల్ వసుంధరాదేవి తెలిపారు.

పీజీ సీట్ల కేటాయింపులు ఇలా...

విభాగం	ప్రతిపాదనలు	అనుమతి
జనరల్ మెడిసిన్	17	17
గైనకాలజీ	15	7
జనరల్ సర్జరీ	15	---
ఆర్థోపెడిక్	12	---
ఈఎన్‌టీ	4	---
రేడియాలజీ	5	---
మొత్తం	68	24



కొలపనాయుడుపల్లి మైనింగ్ యార్డ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన తెల్లరాయి

వెలుగులోకి

మరో అక్రమ మైనింగ్

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పేరుతో మైనింగ్ యార్డ్
- వైసీపీ నాయకుల నిర్వాకం

చేజర్ల, జూన్ 18: మండలంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు పార్టీ నాయకుల చేసిన అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయాయి. అవన్నీ ప్రభుత్వం మారిన వెంటనే ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొలపనాయుడుపల్లి సమీపంలో గురువారం జిల్లా విజిలెన్స్ మైనింగ్ ఏడీ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎమ్‌డీఎల్ అనుమతి పొందిన భూమి అసైన్‌మెంట్ భూమిగా గుర్తించడంతో పాటు పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మినరల్స్ యజమాని వై.సుభరత్నమ్మ పేరుతో అనుమతులు పొంది ఉన్నారు. ఈ మైనింగ్ యార్డ్‌లో 1200 టన్నుల తెల్లరాయి ఉండడంతో పాటు సమీనంలోనే మరో స్థలంలో 350టన్నుల తెల్లరాయి ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మొత్తం 1550టన్నుల తెల్లరాయి నిల్వ ఉన్నట్లు జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. తదుపరి చర్యలు తీసుకునేవరకు రాయిని తరలించకుండా గ్రామ రెవెన్యూ అధికారికి అప్పగించినట్లు వారు పేర్కొ న్నారు. అయితే మైనింగ్ అధికారులు మామూళ్ల మత్తులో అసైన్‌మెంట్ భూమిని మైనింగ్‌యార్డ్ మంజూరు చేయడంతో పాటు, వై.సుభరత్నమ్మ అనే ఆమె ఐసీడీస్ ఆదురుపల్లి సెక్టార్ అంగన్‌వ్యాడీ సూపర్‌వైజర్‌గా ఉండడంత గమనర్హం. ఈ సంఘటనపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలిమరి.




పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి మినరల్స్ వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

మగ పెద్దపులి పాదముద్రలు సేకరించాం !

- దానికి ఎలాంటి గాయాలు తగల్లేదు
- రోడ్డు దాటుతుండగా కారు తగిలింది..
- మర్రిపాడు ఘటనపై విచారిస్తున్నాం : డీఎఫ్‌వో

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 18: జిల్లాలోని మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లి వద్ద సోమవారం పెద్దపులి దాడి వల్ల కారు ధ్వంసమైందని జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఏ.చంద్రశేఖర్ తెలిపారు. అయితే మగ పెద్దపులి పాదముద్రలను మాత్రం సేకరించామన్నారు. నెల్లూరులోని నిప్పో సెంటర్ వద్ద గల అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘటన జరిగిన ప్రాంతంలో సేకరించిన ఆధారాల మేరకు పెద్దపులిని ఢీకొని కారు భారీ దెబ్బతిన్నదంటే... పులికి కూడా తీవ్రగాయలు కావాలి కదా..? అని ప్రశ్నించారు. ఒకవేళ పులి గాయపడితే ఎక్కడికీ కదలలేదన్నారు. కదిరినాయుడిపల్లి పరిసరాల్లో నాలుగు కిలోమీటర్ల వరకు పెద్దపులి జాడేలేదన్నారు. పులికి గాయాలు అయినట్టు ఆధారాలు లేవన్నారు. దీన్ని బట్టి కారు దేన్ని ఢీకొని దెబ్బతిన్నదో విచారిస్తున్నామన్నారు. ఘటనాస్థలంలో మగ పెద్దపులి పాదముద్రలను సేకరించామన్నారు. కారు డ్రైవర్ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అయితే పెద్దపులి సంచారం ఉన్నట్లు నిర్ధారణ అయినందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేనిదే ఎవరూ అడవిలోకి వెళ్లరాదన్నారు. గతంలో సేకరించిన పాదముద్రలు ఆడ పులికి కాగా, ప్రస్తుతం సేకరించినవి మగ పులివని ఆయన వివరించారు.



విలేకరులకు మగ పెద్దపులి పాదముద్రలు చూపుతున్న డీఎఫ్‌వో చంద్రశేఖర్



కదిరినాయుడుపల్లి పరిసరాల్లో డ్రోన్ ద్వారా పెద్దపులి ఆనవాళ్ల గాలింపు

అటవీ అధికారుల గాలింపు

మర్రిపాడు, జూన్ 18 : కదిరినాయుడుపల్లి అడవిలో పెద్దపులి ఆనవాళ్ల కోసం మంగళవారం అటవీశాఖాధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఘటన జరిగిన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల మేర అడవిలో డ్రోన్ ఎగర వేసి తద్వారా వీడియో రికార్డు చేశారు. ఈ ప్రమాదానికి కారణం జంతువుగా భావిస్తున్నా, దాన్ని పులిగా నిర్ధారించలేమని ఆత్మకూరు రేంజర్ శేఖర్ తెలిపారు.

చందనాలంకరణలో మాతాపరమేశ్వరి, సంతానలక్ష్మి

సంగం, జూన్ 18: స్థానిక తూర్పు దళితవాడలో వెలసిన మాతాపరమేశ్వరి మంగళవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన సంతానలక్ష్మి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎల్‌వీ.ప్రసాద్‌శర్మ వేకుజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదాతలుగా అయితా సుబ్బారావు, వెంకటలక్ష్మీ కుమారి దంపతులు వ్యవహరించారు. బుధవారం పసుపు, కుంకు, ప్రదానోత్స వం, సంతానం లేనివారు వరుపడుట, అమ్మవారి గ్రామోత్సవం జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.


సంగం: మాతాపరమేశ్వరిదేవి


ఉదయగిరిలో సంతానలక్ష్మి

హంస వాహనంపై ఆత్మారామస్వామి



సంగం, జూన్ 18: అన్నారెడ్డిపాళెంలో వెలసిన ఆత్మారామ స్వామి మంగళవారం తెల్లవారు జామున హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామిని హంస వాహనంపై ఉంచి గజమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

సంగమేశ్వరుడి లక్ష మల్లెలార్చన

సంగం: శుక్ల ద్వాదశి సందర్భంగా స్థానిక సంగమేశ్వరాలయంలో మంగళవారం రాత్రి కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామికి భక్తులు లక్ష మల్లెలార్చన నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు, గ్రామ పెద్దలతో పాటు ఆలయ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.


లక్ష మల్లెలార్చన నిర్వహిస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

కనుల పండువగా అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం

ఉదయగిరి, జూన్ 18: గన్నేపల్లి పంచాయతీలోని అడవిపేరంటాలమ్మకు మంగళవారం భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పేరంటా లమ్మ పుట్టినిల్లయిన గడ్డంవారిపల్లి నుంచి హక్కుదారులు పాలాయిలను ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో అలంకరించి మిట్టపల్లె, గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, అడవిపేరంటాలమ్మ నగర్ మీదుగా గ్రామోత్సవం సాగింది. మహిళలు వారు కడవతో అమ్మవారిని స్వాగతించి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన డప్పు వాయిద్యాలు, కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నర్రవాడను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే కాకర్ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌బాబు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 18: జిల్లా ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ పుణ్యక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం ఆయన వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్రవాడ పర్యాటక కేంద్రంగా మారితే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈనెల 23నుంచి 27వ తేదీ వరకు జరిగే వెం గమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అధికారులు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. చివరి రెండురోజుల్లో భక్తులు అధికసంఖ్యలో తరలి రానుండడంతో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. గ్రామోత్సవాలు, క్యూలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా చూడాలన్నారు. అనంతరం శాఖలవారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే కాకర్లను పలువురు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ తుమ్మల సురేష్‌బాబు మాజీ ఛైర్మన్ పచ్చవ కరుణాకర్‌బాబు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, సీఐ వేల్పుల గిరిబాబు పాల్గొన్నారు.

వింజమూరు: బొమ్మరాజు చెరువు గ్రామం వద్ద ఉన్న తెలుగుదేశం కార్యాలయంలో మంగళవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను చేరేలా చూస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన అనేక పథకాలను ప్రజలందరికీ అందే విధంగా చూస్తానని తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కాకర్ల చేతుల మీదుగా ఉదయగిరి బీజేపీ కన్వీనర్ కదిరి వెంకటరంగారావు ఆధ్వర్యంలో ఎన్డీఏ విజయానికి చిహ్నంగా ఉసిరిమొక్కను నాటారు. కార్యక్రమంలో కాకర్ల సునీల్, కాకర్ల వెంకట్, మాలేపాటి మల్లికార్జున్‌నాయుడు, హనుమారెడ్డి, ఆవుల రోశయ్య, మేకపాటి మాల్యాద్రి, శరత్‌బాబు, రమణయ్య, సాయికుమార్, దుర్గయ్య, శ్రీహరి, రాజేష్‌నాయుడు, శ్రీనివాసులు, నరేంద్ర, నాగేంద్ర, వెంకటాద్రి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల బడిబాట


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సంగం, జూన్ 18: స్థానిక మిక్సిడ్‌కాలనీలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం విద్యార్థులతో కలిసి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్ల పైబడి ఐదేళ్లలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రం లో చేర్చాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ బాట- పిల్లలకు బంగారు బాట అనే ఫ్లెక్సీ చేతపట్టుకుని నినాదాలు చేస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఆత్మకూరు, జూన్ 18: ఉపాధ్యాయుల సమస్యలు, విద్యా రంగంలోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పనిచేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఆత్మకూరు, పేరారెడ్డిపల్లి, వాశిలి, కరటంపాడు, మురగళ్ల, బట్టేపాడు కాంప్లెక్సల పరిధిలోని ఉపాధ్యాయులతో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వర్లురెడ్డి మాట్లాడారు. ప్రాథమిక విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117జీవో ను రద్దు చేసి, 3,4,5 తరగతులను మరలా వెనక్కు పంపాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిషు మీడియంలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ రామసుబ్బారెడ్డి, ఏ వెంగయ్య, షేక్ సాజిద్, బి దయాకర్ పాల్గొన్నారు.


సభ్యత్వ రశీదును అందజేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి

కొత్తరకం సజ్జ విత్తనాల పంపిణీ

సీతారామపురం, జూన్ 18: అయ్యవారిపల్లి రైతుభరోసా కేంద్రంలో మంగళవారం నెల్లూరు జిల్లా ఆత్మ డీపీడీ శివనారాయణ రైతులకు ఏబీవీ 04 రకం సజ్జ విత్తనాల మినీకిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతపురం జిల్లాలో విజయవంతమైన ఈ రకంను మొదటగా మన జిల్లాలోని అయ్యవారిపల్లి రైతులకు ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం సజ్జ యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్రమోడి విడుదల చేసిన పీఎం కిసాన్ 17 విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కూర్చొని వీక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుగ్గయ్య, నారాయణ, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు శ్వేత, గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివనారాయణ

పీఎం కిసాన్ నిధుల విడుదలపై అవగాహన

ఆత్మకూరు, జూన్ 18: పట్టణంలోని వ్యవసాయం కార్యాలయంలో శ్రీదేవి ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో రైతులకు పీఎం కిసాన్ నగదు విడుదల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ వారణాసిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని టీడీపీ, బీజేపీ నాయకులు, రైతులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, మద్రాస్ ఫర్టిలైజర్ రీజనల్ మేనేజర్ ఆది నారాయణ స్వామి, తుమ్మల చంద్రారెడ్డి పాల్గొన్నారు.


ఎల్ఈడీ ద్వారా వీక్షిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు, రైతులు

అనంతసాగరం: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ 17వ విడత నిధుల విడుదలపై ఏవో శ్రీధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. 25 గ్రామ పంచాయతీల్లో 7,110 మంది రైతులకు రూ.1.42 కోట్లు వారి ఖాతాల్లో జమ కానున్నట్లు వివరించారు. కార్యక్రమాన్ని టెలివిజన్ ద్వారా వీక్షించేలా ఏర్పాటు చేశారు.

సదరం సర్టిఫికెట్ల పంపిణీ

ఉదయగిరి, జూన్ 18: స్థానిక విద్యావనరుల కేంద్రంలో విద్యార్థులకు సదరన్ సర్టిఫికెట్లను మంగళవారం ఎంఈవో మస్తాన్‌వలి పంపిణీ చేశారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ చూపి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పథకాలు పొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు సుభాస్‌చంద్రబోస్, శివనందిని పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు

ఉదయగిరి రూరల్, జూన్ 18: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈవీఎంల పనితీరుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించామని ప్రగల్భాలు పలికిన జగన్ అప్పట్లో ఈవీఎంలు కనపడలేదా అని ప్రశ్నించారు. జగన్ అరాచక పాలనకు ప్రజలు బుద్ధిచెప్పి రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబునాయుడు కావాలనే కసితో ప్రజలు ఓట్లేసి 164 సీట్లు గెలిపిస్తే ఈవీఎంలు సక్రమంగా పనిచేయలేదని జగన్ పనికిమాలిన మాటలు మాట్లాడడం ఆయన రాజకీయ పతనానికి నాంది అన్నారు. భవిష్యత్తులో వైసీపీ, జగన్‌కు పుట్టగతులుండవన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు మాత్రమే ముఖ్యమంత్రిగా సమర్థుడని ప్రజలు గుర్తించి ఆయనకు బ్రహ్మరథం పట్టారన్నారు.

కనువిందుగా మే పుష్పం..

ఉదయగిరి, జూన్ 18: రక్త కలువుగా పిలువబడే మే పుష్పం పట్టణంలోని యూనియన్ రోడ్డుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటి పెరట్లో పూసింది. ప్రతి ఏడాది మేలోనే ఇది పూస్తుందని, ఈ ఏడాది ఎండల తీవ్రతలతో జూన్‌లో వికసించిందని ఆయన చెప్పాడు. పుష్పాన్ని గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పేరుకే పట్టణం.. పల్లెల కన్నా అధ్వానం!

● కావలి శివారులో మౌలిక వసతుల కరువు

కావలిటౌన్, జూన్ 18: పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక వీధులన్నీ పల్లెటూర్లకంటే పరమ అధ్వానంగా ఉన్నాయి. గతంలో పంచాయతీలుగా ఉన్న ముసునూరు, మద్దూరుపాడు, బుడంగుంట గ్రామాలు 2011లో కావలి మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. పంచాయతీలు పట్టణంలో చేని 14ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ మౌలిక వసతులకు నోచుకోలేదు. పలుప్రాంతాల్లో తాగునీటి కుళాయిలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు లేవు. ఏవీధిలో చూసినా మురుగునీరు నిల్వచేరి రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. శివారు ప్రాంతాలు కావడటంతో ఎక్కడ చూసినా చిల్లచెట్లు, మట్టిరోడ్లు, పేడ దిబ్బలు, మురుగు దర్శనమిస్తున్నాయి.

● **పాలకుల నిర్లక్ష్యం**

సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగు నీటి వసతి కల్పనలో పాలకులు, అధికారులు శ్రద్ధ చూపకుండా నిర్లక్షం వహిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ పరిధిలో పేదలకు కేటాయించిన ఇందిరమ్మ గృహాల మెగా కాలనీలను ముసునూరులో నిర్మించారు. ఇందిరమ్మ కాలనీలు ఏర్పడి 20 ఏళ్ల గడిచి నా ఇప్పటికీ మౌలిక వసతులు లేవు. అక్కడి ప్రజల కష్టాలు వర్ణనాతీతం. తాగునీటికి మినరల్ వాటర్ బబుల్స్ కొనుగోలు చేయాల్సిందే. వాడుకునే నీటికి మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌లే దిక్కు. కాగా పట్టణంలో విలీనమైన శివారు ప్రాంతాలను మున్సిపాలిటీ వారు విస్మరించారు. చెత్తతీయక, వీధు లు శుభ్రం చేయక , కాలువలు లేక, పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో ప్రజలు తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.


అధ్వానంగా ఉన్న ముసునూరు మల్లారెడ్డి తోట వీధి

పన్నులు పెరిగాయి తప్ప అభివృద్ధి ఏది ?

తమ ప్రాంతాలు పంచాయతీలుగా ఉన్నప్పుడే బావుండేవి. పట్టణంలో విలీనమైనప్పటికీ మౌలిక వసతుల కల్పన లేదు. ఇప్పటికీ పల్లెటూర్లగానే ఉన్నాయి. అభివృద్ధి మాట ఏమోగాని పట్టణం పేరుతో పన్నులు పెరిగాయే తప్ప జరిగిన అభివృద్ధి శూన్యం.

- ఆర్ వెంకటేశ్వర్లు, ముసునూరు

ఇంటూరిని కలిసిన టీడీపీ శ్రేణులు

కందుకూరు, జూన్ 18: కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు ఘన విజయం సాధించటంతో కందుకూరు నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకున్న తెలుగుదేశం పార్టీ యువనేతలు, కార్యకర్తలు మంగళవారం తిరిగివచ్చిన సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావును కలిసి ప్రసాదాలు అందించి సత్కరించారు. యువనాయకుడు అబ్బూరి వేణు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరుమలకు పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. వారు 236 కిలోమీటర్ల మేర చేసిన పాదయాత్రలో అనుభవాలను అడిగి తెలుసుకున్న నాగేశ్వరరావు వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అబ్బూరి చందు, మధిర బ్రహ్మరూప్, పత్తిపాటి పవన్, వేములూరి సాయి, వేములూరి బ్రహ్మం, వెంకట్, రమణయ్య, సంపత్, శ్రీను, ప్రకాష్, వెంగబాబు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటూరిని కలిసిన న్యాయవాదులు

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మంగళవారం పలువురు న్యాయవాదులు కలిసి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా న్యాయవిభాగం అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, బట్టరుశెట్టి సాయిశంకర్, షేక్ షంషుద్దీన్ తదితరులు నాగేశ్వరరావును సత్కరించి అభినందనలు తెలిపారు.


ఇంటూరి నాగేశ్వరరావును సన్మానిస్తున్న టీడీపీ కార్యకర్తలు

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి

● ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, జూన్ 18: ప్రభుత్వ గురుకుల, మోడల్ పాఠశాలల్లో, ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ గురుకుల, మోడల్‌స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, వసతిగృహాల వార్డెన్లు, సిబ్బంది మంగళవారం సాయంత్రం ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వసతిగృహాలలో చేరే విద్యార్థులకు అన్ని వసతులను కల్పించాలని, నాణ్యమైన ఆహారం అందించటంలోను రాజీ పడవద్దన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


కావలి ఎమ్మెల్యేను కలిసిన ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

కందుకూరు, జూన్ 18: మండలానికి 251 క్వింటాళ్ల జనుము, 34 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. మండలంలోని ఓగూరు గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఏడీఏ పీ.అనసూయ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పీఎం కిసాన్ నగదు 2 వేలు రైతుల ఖాతాలకు బదిలీచేశారిని, జమకాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ అధికారిణి ధనమ్మ మాట్లాడుతూ 21 రకాల విత్తనాల కిట్ పొలంలో వేసుకుని 40 రోజుల తర్వాత దున్నుకుంటే భూమికి మంచి పోషకాలు అంది మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అల్లం రాధయ్య చేతులమీదుగా 21రకాల విత్తనాల కిట్‌లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు కె. శరత్‌కుమార్, పశుసంవర్ధక సహాయకులు షేక్ షాజహాన్, పిడికిటి మాధవ, చల్లా రాజా తదితరులు పాల్గొన్నారు.


విత్తనాల కిట్టు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

విద్యార్థుల నమోదు శాతం పెంచాలి

కావలిటౌన్, జూన్ 18: విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు కృషి చేయాలని కావలి ఎంఈవో-1 గోవిందు కోరారు. మంగళవారం పట్టణ, రూరల్ మండల పరిధిలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి ప్రధానంగా విద్యార్థుల నమోదు, హాజరుశాతం వివరాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిధిలోని విద్యార్థుల వివరాలు ఎంతమంది బడికి వస్తున్నారు.. ఎంతమంది బడికి దూరంగా ఉన్నారు గుర్తించి బడికి దూరంగా ఉన్న పిల్లల తల్లితండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకొని వారు బడికొచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోపణలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు.

రక్తదాన ఆవశ్యకతను చాటండి

కావలిటౌన్, జూన్ 18: రక్తదానం ఆవశ్యతను చాటాలని విశ్రాంత ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రవి నర్సింగ్ హోమ్ సమావేశ మందిరంలో ఐఎంఏ, రెడ్‌క్రాస్, జేవీవీ, యుటీఎఫ్‌ల ఆధ్వర్యంలో జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన రక్తదానం ఆవశ్యకతపై అవగాహన సదస్సు జరిగింది. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ జూలై 1న డాక్టర్స్ డేని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ రక్తనిధిలో తలపెట్టిన రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్లు బెజవాడ రవికుమార్, నళినిపద్మ, రెడ్‌క్రాస్ ఛైర్మన్ రవిప్రకాష్, యుటీఎఫ్ జిల్లా నాయకులు మాధవ, రోటరీ అధ్యక్షురాలు స్వర్ణలత, హరినారపరెడ్డి, దిలీప్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జాపై విచారణ జరిపించాలి

కావలి, జూన్ 18: ప్రభుత్వ భూములు ఆక్రమించి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారిపై, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా గ్రావెల్ తరలించి రియల్‌ఎస్టేట్‌కు వాడుకున్నవారిపై సమగ్ర విచారణ జరిపించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపి కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి వెంకటరత్నం,నూనె వీనయ్య, పీ శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి మహాలక్ష్మమ్మ ఉత్సవాలు

కలిగిరి, జూన్ 18: కలిగిరి పట్టణంలోని పాతూరు ప్రాంతంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ ఉత్సవాలు బుధవారం నుంచి రెండు రోజులపాటు వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 19న ఉదయం 9గంటలకు గణాదిపూజా కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం పుణ్యాహవాచనం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నదాన, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 20వ తేదీ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు జరుగుతాయన్నారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

బిట్రగుంట, జూన్ 18: గ్రామ పంచాయతీ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు వెంకటరత్నం హెచ్చరించారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మంఘళవారం గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసి పోయాయని, ఇకపై ప్రజాసమస్యల పరిష్కారం, ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మండలంలోని 16 పంచాయతీల్లో అక్రమ లేఔట్ల వివరాలు వెంటనే సేకరించాలన్నారు. ప్రభుత్వ, చెరువు భూముల ఆక్రమణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక అందచేయాలన్నారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు సెలవు పెట్టి వెళ్లిపోవచ్చన్నారు. అత్యవసరం తప్ప ఫోన్ మెసేజ్ ద్వారా సెలవులు కోరడం సరికాదని, రాత పూర్వకంగా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమీఉల్లా, డిప్యూటీ తహసీల్దారు జూలియా భాయ్, ఏవో గోవిందు, పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో కార్పొరేషన్ల నిర్వీర్యం

అల్లూరు, జూన్ 18 : గత ప్రభుత్వంలో కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నోర్లు కొట్టారని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మంగళవారం ఆయన అంబేడ్కర్ యువజన సంఘం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో, కాంగ్రెస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎంతో అభివృద్ధి చెందేందుకు అవకాశాలను కల్పించారని, వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరిని పాతాళానికి తొక్కేశారన్నారు. ఎస్సీలకు చెందవలసిన 27 పథకాలను రద్దుచేసి నోటి దగ్గరి కూడుని లాక్కున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కోవూరు బాబు, ఎం నరేంద్ర, నక్కా గిరి పాల్గొన్నారు.

ధ్యానం అలవాటు చేసుకోవాలి

కందుకూరు, జూన్ 18: మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఏకాగ్రత, సకల జీవులతో మిత్రత్వం, వృద్ధాప్య ఛాయల నిరోధకత తదితర ఎన్నో ప్రయోజనాలు ధ్యానం ద్వారా లభిస్తాయని పిరమిడ్ అధ్యులు, మాస్టరు టీఎస్ రామమూర్తి పేర్కొన్నారు. ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల బాలుర వసతిగృహంలో విద్యార్థులకు ధ్యానం తరగతులు నిర్వహించారు. ధ్యాన పద్ధతులపై అవగాహన కల్పించారు.

నర్సింగ్ కాలేజీలో మొక్కలు నాటిన విద్యార్థినులు

జలదంకి, జూన్ 18: మండలంలోని జమ్మలపాలెంలోని శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీ ఆవరణలో యాజమాన్యం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. నర్సింగ్ విద్యార్థినులు రకరకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి, నర్సింగ్ కోర్సు శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లలో కొనసాగుతున్న సర్వే

కావలి, జూన్ 18: కావలి పట్టణంలో అక్రమ లేఅవుట్లపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మూడవ రోజైన మంగళవారం కూడా రోవర్‌తో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, పట్టణప్రణాళికాధికారి బాబూరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు సర్వే చేపట్టారు. వెంగాయగారిపాలెం ప్రాంతంలో వేసిన లేఅవుట్‌లను సర్వే చేసి అందులో ఉన్న ప్రభుత్వ పంట కాలువలను గుర్తించి మార్కింగ్ చేశారు. అక్కడ లేఅవుట్‌లో కట్టిన ప్రహరీ గోడ కొంత బాగం ప్రభుత్వ కాలువ మార్కింగ్ పరిధిలోకి రావడంతో అక్కడ గోడకు మార్కింగ్ చేశారు. గోడ కట్టిన వారికి నోటీస్ ఇచ్చి దానిని తొలగించకపోతే అధికారులే తొలగించనున్నట్లు చెప్పారు.


రోవర్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్, తదితరులు


కాలువ స్థలంలోకి వచ్చిన లేఅవుట్ ప్రహరీ

నేటి నుంచి సర్వే ముమ్మరం : అక్రమ లేఅవుట్లలో బుధవారం నుంచి సర్వే ముమ్మరం చేసేందుకు టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోవర్లతో ఐదు టీమ్‌లతో అన్ని లేఅవుట్‌లలో ప్రభుత్వ స్థలం గుర్తించే విధంగా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. దీంతో అక్రమ లేఅవుట్‌లు వేసిన వారు వాటిల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు.